
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
శుక్రవారం 22 ఆగస్టు 2025



స్వచ్ఛాంధ్రకు సహకరించండి : కలెక్టర్

విశాఖపట్నం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పరిశుభ్రత, పౌరుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి స్వచ్ఛాంధ్ర దినోత్సం నిర్వహిస్తామని కలెక్టర్ ఎంఎస్. హరేంధిరప్రసాద్ తెలిపారు. ఈనెల 23న శనివారం వర్షాకాలంలో పరిశుభ్రత థీమ్‌తో కార్యక్రమ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లా, మండల, జోనల్ ప్రత్యేకాధికారులు చొరవ చూపాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సామాజిక కార్యకర్తలను భాగస్వామ్యం చేసుకోవాలన్నారు.

అక్రమ నిర్మాణాలు కోకొల్లలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

చిన్న చిన్న సందుల్లో భారీ భవంతులు

- ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు
- కానరాని సెట్‌బ్యాక్స్
- ప్లాన్ కంటే అదనంగా రెండేసి అంతస్థులు...
- కళ్లు మూసుకుంటున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు
- నేల స్వభావం ఏమిటనేది పరిశీలించకుండానే అనుమతులు జారీ
- తాజాగా వన్‌టౌన్‌లో ఒరిగిపోయిన అపార్టుమెంట్, ఫంక్షన్‌హాల్



వన్‌టౌన్ ప్రాంతంలో వెలంపేట వద్ద ఒరిగిన భవనాలు

డాబాగార్డెన్స్‌లో కొన్నాళ్ల కిందట ఓ అపార్టుమెంట్ నిర్మాణంలో ఉండగానే కూలిపోయింది. ఆ సమయంలో పనివాళ్లెవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

వన్‌టౌన్‌లోని వెలంపేట పోస్టాఫీస్ సమీపంలో రెండేళ్ల కిందట నిర్మించిన అపార్టుమెంట్‌తో పాటు దానిపక్కనే ఉన్న కల్యాణమండపం తాజాగా ఒరిగిపోయాయి. అధికారులు అప్రమత్తమై అందులో ఉన్నవారిని బయటకు పంపించేశారు. పొరపాటున కూలిపోయి ఉంటే అందులో నివసిస్తున్న కుటుంబాలు సజీవ సమాధి అయిపోయేవి.

నగరంలో భవన నిర్మాణాలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. నిర్మాణాలన్నీ నిబంధనల ప్రకారం జరిగేలా చూడాల్సిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు, సిబ్బంది మామూళ్లకు అలవాటుపడి అక్రమార్కులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. దీంతో ఇరుకు సందుల్లో కూడా బహుళ అంతస్థుల భవనాలు నిర్మితమవుతున్నాయి. వన్‌టౌన్‌లోని వెలంపేట పోస్టాఫీసు సమీపంలో సుమారు 300 గజాల స్థలంలో కశిరెడ్డి ప్లాజా పేరుతో గ్రూప్‌హౌస్ నిర్మాణానికి 2022లో జీవీఎంసీకి ఆన్‌లైన్‌లో



శిథిలమైన పిల్లర్

దరఖాస్తు చేసుకున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు పరిశీలించి గ్రౌండ్+2 భవన నిర్మాణానికి అనుమతిచ్చారు. కానీ బిల్డర్ మాత్రం ప్లాన్ కంటే అదనంగా రెండు అంతస్థులు నిర్మించారు. సెల్లార్‌ను కూడా పార్కింగ్‌కు వినియోగించకుండా, డిపార్టుమెంటల్ స్టోర్ పెట్టేందుకు వీలుగా షట్టర్ ఏర్పాటుచేశారు. ప్లాన్‌కు విరుద్ధంగా రెండు అంతస్థులు అదనంగా నిర్మించడంతో పాటు కనీసం సెట్‌బ్యాక్‌లు విడిచిపెట్టకుండా పది అడుగుల రోడ్డులో భారీ భవనం నిర్మించినా టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్టు ఊరుకున్నారు. అంతా నిబంధనల ప్రకారమే నిర్మించారనే భావనతో చాలామంది అందులో ఫ్లాట్‌లు కొనుగోలు చేసుకుని కుటుంబాలతో నివాసం ఉంటున్నారు. వెలంపేటలోని ఒక అపార్టుమెంట్ కుడి వైపునకు ఒరిగిపోయి, కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని కొందరు బుధవారం రాత్రి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన స్థానిక పోలీసులను అక్కడకు పంపించారు. భవనం పక్కకు ఒరిగిపోయిందని నిర్ధారించడంతో జీవీఎంసీ, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారంతా అక్కడకు చేరుకుని భవనంలో ఉన్నవారిని ఖాళీ చేయించి వేరేచోటకు తరలించారు. ఆ భవనంతోపాటు దానికి అనుకుని ఉన్న ఫంక్షన్‌హాల్ భవనం కూడా ఎడమ వైపునకు ఒరిగిపోయి ఉంది. రెండు భవనాలు ఒకే వైపునకు ఒరిగిపోవడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియక ఆ ప్రాంతంలో నివాసముంటున్న

... మిగతా 6వ పేజీలో

రోజుకు 12 గంటలు పని!

స్టీల్‌ప్లాంటులో గత రెండు నెలలుగా అదే పరిస్థితి



ఆర్‌ఎంహెచ్‌పీ నుంచి వెళ్లే కన్వేయర్ బెల్టుల వద్ద పేరుకుపోయిన మెటీరియల్ నిల్వలు

- ఉద్యోగులు ఎక్కువ ఉన్నట్టు పాలకులు చెబుతున్న మాట వాస్తవమే అయితే అన్నేసి గంటలు పనిచేయించడం ఎందుకో?
- అంత పనిచేస్తున్నా సక్రమంగా అందని జీతాలు
- అనుభవజ్ఞులైన కాంట్రాక్టు కార్మికుల తొలగింపుతో అస్తవ్యస్తంగా ఆర్‌ఎంహెచ్‌పీ నిర్వహణ
- కదలని కన్వేయర్లు
- రైల్వే ర్యాక్‌ల నుంచి మెటీరియల్ అన్‌లోడింగ్‌లోనూ జాప్యం
- నెలకు రూ.కోటికి పైగా డెమరేజీ చెల్లింపు
- ఈ అదనపు చెల్లింపులకు బాధ్యత ఎవరిది?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టీల్ ప్లాంటులో ఇన్‌చార్జి సీఎండీ ఏది చెబితే అదే వేదంగా నడుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ఆయన మాటకే విలువ ఇస్తున్నాయి. ఆయన తనకు నచ్చినట్టు ముందుకువెళ్లడం వల్లనే పూర్తిస్థాయి ఉత్పత్తి సాధ్యం కావడం లేదు. ప్లాంటుకు అత్యంత ముఖ్యమైన రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు (ఆర్‌ఎంహెచ్‌పీ) నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది.

స్టీల్ ప్లాంటులో అవసరానికి మించి ఉద్యోగులు ఉన్నారని వారిని తగ్గిస్తూ వస్తున్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ ద్వారా ఇప్పటికే 1,140 మందిని ఇంటికి పంపించారు. ఇప్పుడు మరో వేయి మందిని అదే వీఆర్‌ఎస్ ద్వారా తగ్గించాలని ఫైల్ సిద్ధం చేశారు. మరోవైపు నెలకు 50 నుంచి 100 మంది రిటైర్ అవుతున్నారు. సీఎండీ లెక్కల ప్రకారం అవసరానికి మించి ఉద్యోగులు ఉన్న మాట నిజమైతే...ఉద్యోగులతో గత రెండు నెలలుగా రోజుకు 12 గంటలు ఎందుకు పనిచేయిస్తున్నారు. శాశ్వత ఉద్యోగులు రోజుకు ఎనిమిది గంటలే పనిచేయాలి. అత్యవసరమైతే అదనపు గంటలు పనిచేయించుకోవచ్చు. అలా చేసిన వారికి దానికి తగ్గట్టుగా సెలవు తీసుకునే అవకాశం ఉంది. లేదంటే ఆ పనికి తగిన వేతనం కూడా తీసుకోవచ్చు. అయితే గత రెండు నెలలుగా రోజుకు నాలుగు గంటలు అదనంగా పనిచేస్తున్నవారికి అదనపు వేతనం మాట పక్కనపెడితే అసలు జీతమే సక్రమంగా ఇవ్వడం లేదు. సీఎండీ లెక్కల ప్రకారం ఉద్యోగుల సంఖ్య ఎక్కువ ఉంటే...అదనంగా 4 గంటలు ఎందుకు పనిచేయిస్తున్నారో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడగడం లేదు. కార్మిక శాఖ కూడా దీనిపై నోరు ఎత్తడం లేదు. ఉద్యోగుల హక్కులను కాలరాస్తుంటే.. అంతా చోద్యం చూస్తున్నారు. ప్రశ్నించిన ఉద్యోగులను సస్పెండ్ చేస్తున్నారు. దీనికి అంతం ఎక్కడో పాలకులే చెపాల్సి ఉంది.

కన్వేయర్ల వద్ద గుట్టలు గుట్టలుగా వ్యర్థాలు

స్టీల్ ప్లాంటులో రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటు (ఆర్‌ఎంహెచ్‌పీ) సుమారు 600 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అక్కడి నుంచి ఐరన్‌ఓర్, కోల్, ఇతర ముడి పదార్థాలు వివిధ విభాగాలకు కన్వేయర్ల ద్వారా పంపిస్తారు. అవి సక్రమంగా నడవాలంటే...24 గంటలూ కాంట్రాక్టు వర్కర్లు కన్వేయర్ల వద్ద ఉండి వాటి పైనుంచి కిందపడే మెటీరియల్‌ను క్లియర్ చేయాలి. ఒక్కపూట ఆ పని ఆగిపోతే కన్వేయర్లు ముందుకు కదలవు. మెటీరియల్ విభాగాలకు అందదు. అనుకున్న

... మిగతా 6వ పేజీలో

నేడు డీఎస్సీ మెరిట్ జాబితా

ఉమ్మడి జిల్లాల వారీగా విడుదల

- 24 లేదా 25న సర్టిఫికెట్ల పరిశీలన?
- ఉక్కు టౌన్‌షిప్‌లోని విశాఖ విమల విద్యాలయం ఎంపిక
- ఎంఈవో/హెచ్ఎం/డిప్యూటీ తహశీల్దారుతో కూడిన 31 బృందాల నియామకం
- మొత్తం పోస్టులు 1,139
- అల్లూరి జిల్లాలో 400 పోస్టులు, సిటీ, మైదాన ప్రాంతంలో 739...

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించిన డీఎస్సీ రాత పరీక్షకు సంబంధించి మెరిట్ జాబితా శుక్రవారం విడుదల చేయనున్నారు. ఐదారు రోజులుగా తర్జనభర్జన పడిన పాఠశాల విద్యాశాఖ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి జిల్లాల వారీగా మెరిట్ జాబితాలను రూపొందించారు. ఆ జాబితాలు జిల్లాలకు పంపుతారు. అదే సమయంలో వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నారు.

డీఎస్సీ రాత పరీక్షలో వచ్చిన మార్కులు, టెట్‌లో వచ్చిన మార్కులను కలిపి మెరిట్ జాబితా తయారుచేశారు. దీంట్లో ఏమైనా తప్పులు ఉన్నాయా? అన్నది ఒకటికి రెండుసార్లు సరి చూస్తున్నారు.



శుక్రవారం మెరిట్ జాబితా విడుదల చేస్తారు. ఉమ్మడి జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 1,139 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. వాటిలో 400 పోస్టులు అల్లూరి సీతారామరాజు జిల్లాలో, మిగిలిన 739 పోస్టులు నగరం, మైదాన ప్రాంతాల్లో ఉన్నాయి. మొత్తం 1,139 పోస్టుల భర్తీకి ఇప్పటికే జిల్లా అధికారులు రోస్టర్ పాయింట్లు రూపొందించి పాఠశాల విద్యాశాఖకు పంపారు. రోస్టర్ పాయింట్లు ఆధారంగానే మెరిట్ జాబితా ఖరారు చేశారు. దీని ఆధారంగా విశాఖపట్నంలో ఈనెల 24 లేదా 25వ తేదీ నుంచి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేస్తారని అంచనా వేస్తున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన కోసం ఉక్కుటౌన్‌షిప్‌లోని విశాఖ విమల విద్యాలయాన్ని ఎంపిక చేశారు. ఆ పాఠశాలలో 31 గదులలో సర్టిఫికెట్ల పరిశీలనకు ఏర్పాట్లుచేస్తున్నారు. ప్రతి గదిలో 50 మంది వంతున అభ్యర్థులను కూర్చోబెట్టి వారి నుంచి ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని పరిశీలన చేస్తారు. డీఎస్సీ రాత పరీక్షకు పెట్టుకున్న దరఖాస్తుకు జత చేసిన సర్టిఫికెట్ల నకళ్లతో సరిచూస్తారు. దరఖాస్తులకు జత చేసిన నకళ్ల వివరాలను ఆన్‌లైన్‌లోనే పరిశీలన చేస్తారు. సర్టిఫికెట్ల పరిశీలన కోసం ప్రతి గదికి ఎంఈవో/హెచ్ఎం/డిప్యూటీ తహశీల్దారుతో కూడిన

... మిగతా 6వ పేజీలో

వ్యూహప్రతివ్యూహాలు

నేడే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం



కౌన్సిల్‌హాల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

- 84 అంశాలతో అజెండా
- స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ, నైట్ ఫుడ్‌కోర్ట్, కోడి వ్యర్థాలపైనే ప్రధాన చర్చ
- నలుపు కండువాలతో ర్యాలీగా రానున్న వైసీపీ కార్పొరేటర్లు
- సమస్యలపై గళమెత్తనున్న కూటమిలోని అసంతృప్త కార్పొరేటర్లు
- ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం శుక్రవారం మేయర్ పీలా శ్రీనివాసరావు అధ్యక్షతన జరగనున్నది. ఈ సమావేశంలో చర్చించేందుకు 84 అంశాలతో అజెండాను తయారుచేసి సభ్యులకు పంపిణీ చేశారు. సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహాలపై కూటమి కార్పొరేటర్లతో పాటు వైసీపీ కార్పొరేటర్లు ఇప్పటికే షాడో సమావేశాలు ఏర్పాటుచేసుకుని కార్యాచరణ రూపొందించుకున్నారు.

స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరించే ప్రయత్నాలను నిలుపుదల చేయాలని కోరుతూ వైసీపీ కార్పొరేటర్లు నలుపు కండువాలు, షర్టులు ధరించి జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి ర్యాలీగా కౌన్సిల్ హాల్‌కు చేరుకోవాలని నిర్ణయించారు. అలాగే పాతజైలురోడ్డులోని ఫుడ్‌కోర్ట్

... మిగతా 6వ పేజీలో



రికవరీ చేసిన బంగారు ఆభరణాలను చూపిస్తున్న డీసీపీ లతామాధురి

భారీ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- గత నెల 13న షీలానగర్‌లో 100 తులాల బంగారం, రూ.13.5 లక్షల అపహరణ
- ఈ ఘటనలో ముగ్గురి అరెస్టు
- 72 తులాల బంగారం, రూ.9.04 లక్షల నగదు స్వాధీనం

మహారాణిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని గాజువాక షీలానగర్‌లో సంచలనం సృష్టించిన 100 తులాల బంగారం, రూ.13.5 లక్షల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి 72 తులాల బంగారం, రూ.9.04 లక్షల నగదును రికవరీ చేశారు. పోలీస్ కమిషనరేట్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో క్రైమ్ డీసీపీ కె.లతామాధురి వివరాలు వెల్లడించారు.

షీలానగర్ వెంకటేశ్వర కాలనీలోని ఒక అపార్టుమెంట్‌లో నివసిస్తున్న దంపతులు జూలై 13న ఇంటికి తాళం వేసి కింద ఫ్లోర్‌లో ఉన్న తమ కుమార్తె ఇంట్లో నిద్రించారు. తెల్లవారుజామున ఇంటికి వెళ్లేసరికి తలుపులు బద్ధలుకొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూస్తే బీరువాలోని సుమారు 100 తులాల బంగారు ఆభరణాలు, రూ.13.5 లక్షల నగదు కనిపించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు

... మిగతా 6వ పేజీలో

అన్నదానంలో లోపాలపై విచారణ శూన్యం

అక్రమార్కులకు ఉన్నతాధికారుల అండ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



- నగరంలోని ఒక దేవస్థానంలో బయోమెట్రిక్ వినియోగించడం లేదని స్పష్టంగా పేర్కొన్నా చర్యలకు వెనకడుగు
- ఒకరు తప్పు చేస్తే అందరి నుంచి నివేదికలు
- ఇదీ దేవదాయ శాఖ పనితీరు

దేవదాయ శాఖ ఉన్నతాధికారుల తీరు అనేక అనుమానాలకు తావిస్తోంది. విశాఖపట్నం జిల్లాలోని కొన్ని ప్రధాన ఆలయాల్లో అన్నదాన పథకంలో అక్రమాలు జరుగుతున్నాయని, స్థానిక అధికారులు నెలకు లక్ష రూపాయలు డిమాండ్ చేస్తున్నారని 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురిస్తే... దానికి విజయవాడ అధికారులు మసి పూసి మారేడు కాయ చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఈ పథకం ఒక్కో దగ్గర ఒక్కోలా అమలు చేస్తున్నారు. ఎంతమంది భక్తులకు అన్నదానం చేస్తున్నారో ఒక్క సింహాచలం దేవస్థానంలో తప్ప మిగిలినచోట్ల బయోమెట్రిక్ లెక్కలు లేవు. ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' కథనంలో ప్రస్తావించింది. మిగిలిన దేవస్థానాలు ఎందుకు బయోమెట్రిక్ అమలు చేయడం లేదో వివరణ కోరాల్సిన దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఆ విషయాన్ని పక్కనపెట్టింది. ఆ ఒక్క దేవస్థానం సిబ్బందిని రక్షించడానికి మిగిలిన దేవాలయాలన్నింటికీ నోటీసులు జారీ చేసింది.

శ్రీకాకుళం అరసవిల్లి, విశాఖలోని కనకమహాలక్ష్మి ఆలయం, సింహాచలం, అనకాపల్లిలోని నూకాలమ్మ, అన్నవరంలో సత్యనారాయణ దేవస్థానాలకు ఈ నోటీసులు జారీచేసింది. అన్నదాన పథకంతో పాటు ప్రసాదాల తయారీలో ఉపయోగించే దినుసులు అంటే బియ్యం, కందిపప్పు, పెసరపప్పు, నూనె, నెయ్యి, శనగపిండి తదితరాల నాణ్యత పరీక్షల నివేదికలు పంపాలని కమిషనర్ కార్యాలయం కోరింది. అలాగే గత నెల రోజులు ఏ దేవస్థానంలో ఎంతమందికి అన్నదానం నిర్వహించారో బయోమెట్రిక్ వివరాలు సమర్పించాలని ఆదేశించింది. అన్నదానానికి వచ్చే భక్తులకు టోకెన్లు ఇస్తున్నారని,

... మిగతా 6వ పేజీలో

కుమార్తెలపై అత్యాచారం కేసులో ముద్దాయికి 20 ఏళ్లు జైలు

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మైనర్లు అయిన ఇద్దరు కుమార్తెలపై అత్యాచారానికి పాల్పడిన తండ్రికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయాధికారి గురువారం తీర్పు చెప్పారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ అందించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా వాసి ఒకరు ఉపాధి కోసం కుటుంబంతో విశాఖ వలస వచ్చి ఆరిలోవ ప్రాంతంలో నివాసం ఉండేవాడు. అతడికి భార్య, 12, 8 సంవత్సరాల వయసున్న ఇద్దరు కుమార్తెలు, అంతకంటే చిన్నవాడైన కుమారుడు ఉన్నారు. అతని భార్య ఆస్పత్రిలో పనిచేస్తుండేవారు. ఆమెకు తరచూ రాత్రి విధులు ఉండేవి. ఆమె లేని సమయంలో అతను తన ఇద్దరు కుమార్తెలపై లైంగికంగా దాడికి పాల్పడేవాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించేవాడు. రానురాను తండ్రి కిరాతకం పెరిగిపోవడంతో సహించలేని

... మిగతా 6వ పేజీలో



పూజలో పాల్గొన్న భక్తులు

సింహగిరివాసుడికి స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహునికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలను బయటకు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణలు జరిపారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి స్వర్ణ సంపెంగలతో పూజలు చేశారు. తరువాత నిత్య కల్యాణం నిర్వహించారు.

ఎమ్మెల్యే గంటాకు ఆటో డ్రైవర్ల వినతి

తగరపువలస, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : స్త్రీశక్తి పథకం అమలుతో ఆటో డ్రైవర్లు సర్వీసులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జోన్ అధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి అన్నారు. గురువారం ఆటో డ్రైవర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును భీమిలిలో కలిసి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ సర్వీసులు లేక, ఆటోలకు ఫైనాన్స్ కట్టలేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని,వారిని ఆదుకోవాలని కోరారు. సీఐటీయూ జోన్ కార్యదర్శి ఎస్. అప్పలనాయుడు మాట్లాడుతూ వాహన మిత్ర పథకం ద్వారా ఆటో కార్మికులకు ఏడాదికి రూ.25 వేలు ఆర్థిక సాయం చేయాలని కోరారు. అలాగే కార్మికుల పిల్లల్ని ప్రభుత్వమే దత్తత తీసుకుని చదివించాలని, ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని విన్నవించారు. ఈకార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు నీలాతి రాము, నమ్మి నాయుడు, పెంటరాజు, రమణ, శ్రీను పాల్గొన్నారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి

మధురవాడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా అన్ని శాఖల అనుమతి తీసుకోవాలని పీఎంపాలెం పోలీసులు తెలిపారు. గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. నిర్వాహకులు ముందుగా తాము ఉత్సవాలు నిర్వహిస్తున్న స్థలం,నిమజ్జనం తేదీ, ప్రతిమ ఎత్తు, తదితర వివరాలను పోలీస్ స్టేషన్‌లో తెలియజేస్తే పరిశీలించి ఒక పత్రం ఇస్తారు.దాన్ని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయం అధికారులకు సమర్పిస్తే అనుమతి పత్రం అందిస్తారు. నిర్వాహకులు ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

25న కార్మిక పింఛన్‌దారుల నిరసన

తగరపువలస, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కార్మిక పింఛన్లను కనీసం రూ. 7,500లకు పెంచాలని చిట్టివలస జూట్‌మిల్లు పింఛన్‌దారుల సంఘం ప్రధాన కార్యదర్శి దామోదర బాబాజీ డిమాండ్ చేశారు. గురువారం తగరపువలసలో జూట్‌మిల్లు, ఇతర కార్మిక పింఛన్‌దారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన కార్మికుల పట్ల కేంద్రం వివక్ష చూపిస్తుందన్నారు.ప్రస్తుతం కార్మికులకు వస్తున్న రూ. 1000 పింఛన్ ఎటూ సరిపోవడం లేదని, నిత్యావసర సరకుల ధరలు పెరిగిన నేపథ్యంలో కార్మికుల పింఛన్ మొత్తాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఈనెల 25న కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఆ సంఘం ఏరియా అధ్యక్షుడు కానూరి రాంబాబు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, చిల్ల అప్పారావు పంపాన సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన

భీమునిపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలకు తక్షణమే వేతనాలు పెంచాలని రాష్ట్ర అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. గురువారం మధ్యాహ్నం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ఆందోళన వ్యక్తం చేశారు.అనంతరం పీవో ఎం. శ్రీదేవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి తమకు వేతనాలు పెంచలేదని, దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటలక్ష్మి, శాంతికుమారి, పి. పద్మ, శ్రీదేవి, ఆర్. అచ్యుతాంబ, తదితరులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మీ దేవాలయంలో పూజలు

కొమ్మాది, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) :అన్నంరాజునగర్‌లో ఉన్న అష్టలక్ష్మీ దేవాలయంలో శ్రావణ మాసం గురువారం పుస్కరించుకుని అష్టలక్ష్మీ హోమం నిర్వహించారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ దంపతులతో ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధరస్వామి హోమం జరిపించారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

భీమునిపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకింగ్ సేవల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. సురేఖ సూచించారు. గురువారం ఆ కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు డీఎస్సీ మెరిట్ జాబితా

... 5వ పేజీ తరువాయి

బృందాలను నియమించారు. అంటే 31 మంది ఎంఈవోలు, హెచ్ఎంలు, డీటీలకు డ్యూటీలు వేశారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఈ మేరకు విశాఖ డీఈవో ప్రేమ్‌కుమార్‌కు ఆదేశాలు జారీచేశారు. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో 1:1 ప్రాతిపదికగానే పిలుస్తున్నారు. అంటే 1,139 మందిని పిలుస్తారు. ఒకవేళ ఒక అభ్యర్థి రెండు, మూడు పోస్టులు దక్కించుకునే మార్కులు సంపాదిస్తే ఒక పోస్టును మాత్రమే అతను ఎంపిక చేసుకోవాలి. అటువంటి సందర్భాలలో సదరు అభ్యర్థి తరువాత మార్కులు తెచ్చుకునే అభ్యర్థికి అవకాశం ఇస్తారు. ఇక్కడ కూడా రోస్టర్ పాయింట్లను పరిగణనలోకి తీసుకుంటారు. సర్టిఫికెట్ల పరిశీలన ముగిసిన తరువాత నియామక పత్రాలు అందజేసే ప్రక్రియ చేపడతారు. దీనిపై స్పష్టత రావలసి ఉంది.

ముద్దాయికి 20 ఏళ్లు జైలు

... 5వ పేజీ తరువాయి

పెద్ద కుమార్తె విషయాన్ని పాఠశాల టీచర్‌కు చెప్పింది. బాలిక తల్లిని టీచర్ పిలిచి విషయాన్ని వివరించింది. కుమార్తెల ఇద్దరి నుంచి నిజం తెలుసుకున్న తల్లి గత ఏడాది సెప్టెంబరు 14న ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దిశ పోలీస్ స్టేషన్ ఏసీపీ ఇ.పెంటారావు కేసు నమోదుచేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. బాధిత బాలికలు ప్రభుత్వం నుంచి పరిహారం పొందవచ్చునని తీర్పులో పేర్కొంటూ ఇందుకు తగిన న్యాయ సహాయం అందించాలని న్యాయసేవా ప్రాధికార సంస్థకు సూచించారు.



షాపింగ్ కాంప్లెక్స్ వద్ద మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే గంటాతో ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు



భీమిలిలో బీచ్ కోతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా, మేయరు పీలా

బీచ్ రోడ్‌లో రిటైనింగ్ వాల్

- రూ. 210 కోట్లతో తీరం కోత నివారణకు చర్యలు
- త్వరలో భీమిలి డెవలప్‌మెంట్ ఫోరం ఏర్పాటు
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్ రోడ్డులో కోత నివారణకు రూ. 210 కోట్లతో రిటైనింగ్ వాల్ సహా ఇతర రక్షణ చర్యలు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం అనంతరం మేయర్ పీలా శ్రీనివాసరావుతో కలిసి శిథిలావస్థలో ఉన్న మునిసిపల్ చౌల్ట్రీని, బీచ్‌రోడ్‌లో కోతకు గురవుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి త్వరలోనే భీమిలి డెవలప్‌మెంట్ ఫోరం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఇందులో అన్ని వర్గాలకు స్థానం కల్పిస్తామన్నారు. ఫోరంలో అందరి అభిప్రాయాలు తీసుకుని నియోజకవర్గం అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సభ్యులు సమావేశమవుతారని చెప్పారు. ఇప్పటికే భీమిలి అభివృద్ధిపై విజన్ డాక్యుమెంట్ రూపొందించామని, ఇది తుది దశకు చేరిందన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు వచ్చే ఏడాది జూన్ నాటికి సిద్ధమవుతుందన్నారు. ఆ సమయానికి పెరిగే ట్రాఫిక్ రద్దీని అంచనా వేస్తూ భీమిలి, తగరపువలస నుంచి నగరానికి వున్న అన్ని రహదారుల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తగరపువలస - భీమిలి రహదారిని 150 అడుగులకు విస్తరించనున్నామని, స్థానికుల వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకుని అందరి ఆమోదయోగ్యంతో సవరించిన తుది ఆర్‌డీపీ ప్రకారం విస్తరణ జరగుతుందన్నారు. మధురవాడ ప్రాంతంలో రూ. 595 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు, రూ. 292 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించామన్నారు. స్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డు ప్రతి 15 రోజులకోసారి సమావేశమవుతుందని, దీనిలో విశాఖకు ప్రాధాన్యత ఇస్తున్నారని, భీమిలి నియోజకవర్గంలోనే ఆ అభివృద్ధిలో అధిక శాతం పనులను ప్రతిపాదిస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని 9 వార్డుల్లో రూ. వంద కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గోస్తనీ నదిలో చెక్ డ్యామ్ నిర్మించడం వల్ల వాటర్ రీచార్జ్ అవుతుందని, ఆ పనులను చేపట్టే అవకాశాలను అధికారులు పరిశీలించాలన్నారు. భీమిలి-విజయనగరం మధ్య బస్సులను ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

పట్టణంలోని 3వ వార్డులో రూ. 2.59 కోట్లతో నిర్మించిన మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్, కాయగూరలు, చేపల విక్రయశాలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మేయరు పీలా శ్రీనివాసరావు ప్రారంభించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో 11 దుకాణాలు, ఫిష్ అండ్ వెజిటబుల్ మార్కెట్‌లో 28 స్టాల్స్ నిర్మించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, గాడు చిన్నికుమారిలక్ష్మి, పీవీ నరసింహం, లొడగల అప్పారావు, భీమిలి ఏఎంసీ చైర్మన్ కురిమిన రామస్వామినాయుడు, జోనల్ కమిషనరు అయ్యప్పనాయుడు, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, టీడీపీ నాయకులు గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్, పాసి నరసింగరావు, దంతులూరి అప్పల నరసింహరాజు, గాడు అప్పలనాయుడు, కొప్పల రమేశ్, అక్కరమాని వెంకటరావు, మొల్లి లక్ష్మణరావు, పిట్టా సురేశ్, పిల్లా వెంకటరావు, పాసి త్రినాథరావు, చెట్టిపల్లి గోపి, ప్రసాద్ పాల్గొన్నారు.

చౌల్ట్రీ భవనం పరిశీలన

పాతబస్టాండ్ వద్ద శిథిలమై నిరుపయోగంగా ఉన్న మునిసిపల్ చౌల్ట్రీని ఎమ్మెల్యే గంటా, మేయరు పీలా పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న మునిసిపల్ చౌల్ట్రీపై 'ఆంధ్రజ్యోతి' లో ఇటీవల కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ భవనానికి నివాసయోగ్యమైన సామర్థ్యం ఉందో లేదో తెలుసుకోవడానికి ఇంజనీరింగ్ అధికారులకు స్ట్రక్చరల్ సౌండ్‌నెస్ తెలియజేయడానికి లేఖ రాయాలని జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడును ఆదేశించారు. అలాగే పురాతనమైన ఈ భవనానికి హెరిటేజ్ స్టేటస్ ఉందో లేదో కూడా తెలుసుకోవాలన్నారు.

కాశీవిశ్వేశ్వరుని ఆలయానికి దారి చూపండి

కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు భక్తుల విజ్ఞప్తి



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తో మాట్లాడుతున్న భక్తులు

సింహాచలం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న ఆలయ ప్రధాన రాజగోపురానికి ఎదురుగా ఉన్న కాశీవిశ్వేశ్వర పంచాయతన ఆలయానికి సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను గోపాలపట్నం ప్రాంతానికి చెందిన దొడ్డి కిరణ్, మరో ముగ్గురు భక్తులు కోరారు. గురువారం సింహగిరిపై భక్తుల అభిప్రాయ సేకరణకు వచ్చిన కలెక్టర్‌ను వారు కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతానికి భిన్నంగా మాడ వీధిలో బారికేడ్లు బిగించడంతో విశ్వేశ్వరుని దర్శనానికి మార్గం ఎటువైపు నుంచి ఉందో తెలియడం లేదన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రధాన ఆలయం నుంచి బయటకు వచ్చే భక్తుల రద్దీని తగ్గించేందుకు అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారన్నారు. విశ్వేశ్వరుని ఆలయానికి మార్గ సూచికలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

మేజర్ రామ్‌గోపాలనాయుడుకు సన్మానం



రామ్‌గోపాలనాయుడును సన్మానిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

కొమ్మాది, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ ఆర్మీలో కీర్తి చక్ర అవార్డు అందుకున్న తొలితెలుగు వ్యక్తిగా మేజర్ రామ్‌గోపాలనాయుడు చరిత్రలో నిలిచిపోతారని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖ బ్రత బాగ్చి అన్నారు. గురువారం పీఎంపాలెంలోని ఎన్ఐఎస్ఎఫ్, వృక్షా విద్యా సంస్థలు, మాలతాంబ విద్యానికేతన్ ఆధ్వర్యంలో రామ్‌గోపాలనాయుడును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌లో రామ్‌గోపాలనాయుడు సాహసానికి దేశం మొత్తం ఫిదా అయ్యిందని, 79 ఏళ్ల స్వాతంత్ర్య భారతావనిలో కీర్తి చక్ర బిరుదు అందుకున్న తొలి తెలుగు వ్యక్తిగా ఆయన నిలిచారని కొనియాడారు. రామ్‌గోపాలనాయుడు మాట్లాడుతూ ఆర్మీలో తన ప్రస్థానం, యుద్ధ సమయంలో తన అనుభవాలను వివరించారు. ప్రతిఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలని, దేశానికి సేవ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రామ్‌గోపాలనాయుడు కుటుంబ సభ్యులతో పాటు ఎన్ఐఎస్ఎఫ్ అధినేత సునీల్ మహంతి, వృక్షా విద్యా సంస్థల కరస్పాండెంట్ రమణమూర్తి, రిటైర్డ్ ఎస్పీ దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు భీమిలిలో ఉచిత వైద్య శిబిరం

భీమునిపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మెగాస్టార్ చిరంజీవి జన్మ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం గంటస్తంభం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు చిరంజీవి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు మెయిన్ రోడ్‌లో కొత్త షాపింగ్ మాల్ వద్ద ఈ శిబిరం జరుగుతుందన్నారు. సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రి సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభిస్తారని చెప్పారు.

మట్టి అక్రమంగా తరలిస్తున్న వాహనాలకు జరిమానా

పద్మనాభం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి రవాణా చేస్తున్న మూడు వాహనాలకు తహసీల్దారు రూ. 15 వేలు అపరాధ రుసుం విధించినట్టు సీఐ సీహెచ్ శ్రీధర్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో రాత్రి గస్తీ తిరుగుతుండగా అనధికారికంగా మట్టి రవాణా చేస్తున్న మూడు లారీలను పట్టుకొని సీజ్ చేశామన్నారు. నివేదిక తయారు చేసి తహసీల్దారుకు పంపించగా ఫైన్ వేశారన్నారు.

మద్దిలో కృష్ణాష్టమి వేడుకలు

పద్మనాభం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది గ్రామంలో ప్రబోధ సేవా సమితి,ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గురువారం ఎంపీపీ కె. రాంబాబు, తులసి లక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కృష్ణుని తత్వాన్ని కీర్తిస్తూ నామ సంకీర్తన, తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈనెల 26న భారీ ఊరేగింపుతో వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు త్రినాథరావు, కృష్ణసూరప్పడు, సురేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులతో ఆధార్ సీడింగ్ చేయించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి

పద్మనాభం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ సీడింగ్ చేయకపోవడం వల్ల అన్నదాత సుఖీభవ పథకం పొందని రైతులను గుర్తించి ఆధార్ సీడింగ్ చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి కె. అప్పలస్వామి చెప్పారు. గురువారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధార్‌లో తప్పులు వల్ల మండలంలో 342 మంది అన్నదాత సుఖీభవ పొందలేకపోయారన్నారు. వారు ఆధార్ సీడింగ్ చేయించుకునేలా చేయాలన్నారు. అలాగే మృతి చెందిన రైతులు 209 మంది ఉన్నారని, వారి కుటుంబ సభ్యులు మ్యుటేషన్ చేయించుకునే విధంగా వీఆర్వోలు చొరవ తీసుకోవాలని చెప్పారు. ఆధార్ సీడింగ్, మ్యుటేషన్ చేయించుకునే వారికి మలి విడతలో నిధులు మంజూరవుతాయన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆనందపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ అప్పలనాయుడు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.వేములవలస, బీపీ కళ్లాలు, ఎల్‌వీ పాలెం, ఆనందపురం, సత్య కల్యాణి అపార్ట్‌మెంట్, ఈగలవానిపాలెం, దుక్కవానిపాలెం, మెట్టమీదపాలెం, పాలవలస, గుడిలోవ, వెల్లంకి, పెద్దిపాలెం, పొడుగుపాలెం, కుసులువాడ, జగన్నాథపురం, వెంకటాపురం, చందక, గొట్టిపల్లి, తర్లువాడ, నగరపాలెం, పందలపాక, బాకురుపాలెం, ఇచ్ఛాపురం, చిన్నయ్యపాలెం, రామానేనిపేట, రేగానిగూడెం, ముకుందపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

సాగర్‌నగర్ : ఆదిభట్లనగర్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ త్రీ ఈఈ సింహాచలనాయుడు తెలిపారు. తాటిచెట్లపాలెం, దసపల్లా లేఅవుట్, సుభాష్‌నగర్, ముసలయ్యపాలెం, అల్లూరి సీతారామరాజు జంక్షన్ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

కొమ్మాది : కొమ్మాది సబ్‌స్టేషన్ పరిధిలోని పరదేశిపాలెం 11 కేవీ ఫీడర్ నిర్వహణ దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు ఏఈ నరేశ్ తెలిపారు. పరదేశిపాలెం ఈడబ్ల్యూఎస్ కాలనీ, కొత్త పరదేశిపాలెం, పాత పరదేశిపాలెం, డంపింగ్ యార్డు ఏరియా, చిలుకూరి లేఅవుట్ ప్రాంతాకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

భీమునిపట్నం : మండలంలోని కాపులుప్పాడ 33/11 కేవీ సబ్‌స్టేషన్ మెయింటనెన్స్, స్కాడా పనుల శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని జోన్ త్రీ ఈఈ సింహాచలం నాయుడు తెలిపారు. బీచ్‌రోడ్‌లో రామాద్రి, మంగమారిపేట, తిమ్మాపురం, కాపుల దిబ్బడిపాలెం, కె. నగరపాలెం, రెడ్డీలపాలెం, సోమన్నపాలెం, కళాగ్రామం, గ్రేహౌండ్స్ ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

పద్మనాభం : పద్మనాభం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొన్ని ఫీడర్లలో లైను మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ జగన్మోహనరావు తెలిపారు రెడ్డిపల్లి ఫీడరు పరిధిలోని పొట్నూరు, తునివలస, నర్సాపురం, విజయానందపురం, చిన్నాపురం, కొయ్యపేట, నేరేళ్లవలస గ్రామాలతో పాటు రేవిడి రూరల్ పరిధిలోని బర్లపేట, కుర్రపల్లికు సరఫరా ఉండదన్నారు.

అక్రమ నిర్మాణాలు కోకొల్లలు

... 5వ పేజీ తరువాయి

వారు బిక్కుబిక్కుమంటూ కాలంగడుపుతునారు.

ప్రతీసందులోనూ అక్రమ నిర్మాణాలే

నగరంలో ఏ సందులో చూసినా అక్రమ నిర్మాణాలే కనిపిస్తున్నాయి. రెండు, మూడు అడుగులు దారి ఉండే సందుల్లో కూడా బహుళ అంతస్థుల భవనాలు నిర్మించేస్తున్నారు. సీతంపేట వినాయక ఆలయం సమీపంలో మూడు అడుగుల సందులో రెండు అపార్టుమెంట్‌లను జీవీఎంసీ ఇచ్చిన ప్లాన్ కంటే అదనంగా ఒక అంతస్థు నిర్మించడంతోపాటు కనీసం సెట్‌బ్యాక్‌లు కూడా విడిచిపెట్టలేదు. దీనిపై స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. మద్దిలపాలెం చేపలబజారు రోడ్డులో జీవీఎంసీ అధికారులు ఇచ్చిన ప్లాన్ కంటే అదనంగా రెండు అంతస్థులు నిర్మించినా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. అలాగే శివాజీపాలెం వినాయకుడి గుడి వెనుక సందులో జీ+2 నిర్మాణానికి జీవీఎంసీ ప్లాన్ జారీచేస్తే బిల్డర్ ఏకంగా రెండు అంతస్థులు అదనంగా నిర్మించేస్తున్నారు. దీనిపై కొందరు జీవీఎంసీకి ఫిర్యాదు చేస్తే టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండానే సమస్యను పరిష్కరించినట్టు ఫిర్యాదుదారుడికి సమాచారం పంపించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మద్దిలపాలెం దయారాం స్వీట్స్ వెనుక వైపు సందులో వ్యక్తిగత ఇల్లు నిర్మాణానికి జీవీఎంసీ అనుమతిస్తే అందులో ఏకంగా 16 ఫ్లాట్లతో భారీ అపార్టుమెంట్‌నే నిర్మించేశారు. నగరంలో ఇలాంటి నిర్మాణాలు కోకొల్లలుగా ఉంటున్నాసరే టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం పట్టనట్టు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్తులో దీనివల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిసినా సరే తమ వ్యక్తిగత లబ్ధిని దృష్టిలో పెట్టుకుని అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

వార్డు సచివాలయం నుంచే కలెక్షన్ మొదలు...

నగరంలో ఎవరైనా భవన నిర్మాణం చేయాలంటే ముందుగా లైసెన్స్‌డ్ సర్వేయర్ వద్దకు వెళ్లి స్థలానికి సంబంధించి పత్రాలు, భవనం డిజైన్, డ్రాయింగ్, సాయిల్ టెస్ట్ రిపోర్టును ఏపీడీపీఎంఎస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆ దరఖాస్తు సంబంధిత ప్రాంత వార్డు సచివాలయంలోని ప్లానింగ్ సెక్రటరీకి చేరుతుంది. అక్కడే వసూళ్ల పర్వం మొదలవుతుంది. దరఖాస్తును చూడగానే స్థలాన్ని చూడాలంటూ లైసెన్స్‌డ్ సర్వేయర్ ద్వారా వార్డు ప్లానింగ్ సెక్రటరీ భవన నిర్మాణదారుడిని కలుస్తాడు. స్థలంపై వివాదాలు, రోడ్డు సదుపాయం, నేల స్వభావం వంటివి పరిశీలించిన తర్వాత వాటిపై రిమార్కు రాసి ఉన్నతాధికారికి దరఖాస్తును పంపించాల్సి ఉంటుంది. కానీ భవనం స్థాయిని బట్టి అధికారులందరికీ ఇవ్వాలంటూ కొందరు కనీసం రూ.ఐదు నుంచి రూ.పది లక్షలు వసూలు వసూలుచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు అందితే వారం రోజుల్లో ప్లాన్ ఆన్‌లైన్‌లో ఆమోదం పొందేస్తుంది. అలా కానట్టయితే ఏవో కొర్రీలు వల్ల నెలలపాటు పెండింగ్‌లో ఉండిపోతుంది. అనుకున్నంత డబ్బులు ఇచ్చేస్తే తర్వాత భవన నిర్మాణం వైపు టౌన్‌ప్లానింగ్ అధికారులు చూడడం లేదు. సెట్‌బ్యాక్‌లు వదలకపోయినా, రోడ్డు వెడల్పు అవసరమైనంత లేకపోయినా అంతా సక్రమంగానే ఉన్నట్టు నిర్మాణదారుడికి అండగా నిలుస్తారు. జారీ చేసిన ప్లాన్ కంటే అదనపు అంతస్థులు నిర్మిస్తే...అందుకు తగ్గట్టు వసూలు చేస్తున్నారు.

అన్నదానంలో లోపాలపై విచారణ శూన్యం

... 5వ పేజీ తరువాయి

బయోమెట్రిక్ తీసుకోవడం లేదని చాలా స్పష్టంగా వార్త ప్రచురిస్తే దానిపై బాధ్యులైన అధికారులను వివరణ కోరకుండా లేని బయోమెట్రిక్ వివరాలు సమర్పించాలని కోరడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. విశాఖలోని ఒక ఆలయంలో అన్నదానం విభాగం నుంచి లక్ష రూపాయలు ప్రతి నెలా ఉన్నతాధికారికి ఇవ్వడానికి అక్కడ బయోమెట్రిక్ అమలు చేయడం లేదు. రికార్డులు అన్నీ మాన్యువల్‌గా నచ్చినట్టు రాసుకుంటున్నారు. ఆ దేవస్థానంలో బయోమెట్రిక్ యంత్రాలు ఉన్నప్పటికీ, వాటితోనే భక్తుల సంఖ్య నమోదు చేయాలని ఉత్తర్వులు ఉన్నప్పటికీ పాటించకపోవడం అక్కడి అవకతవకలకు అద్దం పడుతోంది. ఇది పత్రికలో రాగానే బయోమెట్రిక్ అమలు చేయాలని ఆదేశించకుండా ఐదు జిల్లాల అధికారులు నివేదిక ఇవ్వాలని విజయవాడ అధికారులు కోరడం తప్పు చేసిన వారిని తప్పించడానికేనని దేవదాయ శాఖ వర్గాలు కోడై కూస్తున్నాయి. అన్నదానంలో డబ్బులు మిగలడానికి నాశిరకం దినుసులు వాడుతున్నారు. ఇప్పుడు వాటికి లేబొరేటరీ నివేదిక కోరుతున్నారు కాబట్టి వాటిని కూడా నకిలీవి తయారుచేసి పంపే అవకాశం ఉందనే అనుమానాలు కలుగుతున్నాయి. సింహాచలం దేవస్థానం సిబ్బందిని ఇటీవల తప్పనిసరిగా బదిలీ చేయాల్సి వచ్చింది. కమిషనర్ కార్యాలయం అధికారులు వారిని దూరప్రాంతాలకు పంపకుండా స్థానికంగా ఉన్న కనకమహాలక్ష్మి ఆలయానికి బదిలీ చేశారు. ఒకరిద్దరిని దూరంగా వేసినా నెల రోజులు తిరగకుండానే మళ్లీ విశాఖపట్నం తీసుకువచ్చారు. ఇప్పుడు అక్కడే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాటిపై దృష్టిసారిస్తే కమిషనర్ కార్యాలయానికి కూడా సెగ తగిలే అవకాశం ఉండడంతో ఎటువంటి ప్రత్యేక విచారణ చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

వ్యూహప్రతివ్యూహాలు

... 5వ పేజీ తరువాయి

తొలగింపు, కోడివ్యర్థాల తరలింపులో నేతలు, అధికారుల ప్రమేయం, రోడ్లను శుభ్రం చేసే యంత్రాలను బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న కాంట్రాక్టర్‌కు అప్పగించడం వంటి అంశాలపై సభలో నిలదీయాలని వైసీపీ కార్పొరేటర్లు భావిస్తున్నారు. మరోవైపు కూటమిలోని అసంతృప్త కార్పొరేటర్లు సైతం తమవార్డులకు నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం, జోన్ల పునర్విభజన, క్లాప్ వాహనాల నిర్వహణ లోపభూయిష్టంగా తయారవ్వడం, కోడి వ్యర్థాల తరలింపులో కార్పొరేటర్లు, రౌడీషీటర్ల ప్రమేయం, పాతజైలురోడ్డులోని ఫుడ్‌కోర్ట్ తరలింపు, మెకానికల్ విభాగంలో జరుగుతున్న అవినీతిపై అధికారులను నిలదీయాలని భావిస్తున్నారు. యూసీడీ ఆధ్వర్యంలో ఐదుచోట్ల ఆధునిక స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ల నిర్మాణం అంశం, వెండింగ్ కమిటీల ఎంపిక వంటి అంశాలపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది. కాగా స్టీల్‌ప్లాంటులోని ఒక్కో విభాగాన్ని ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించాలని సీపీఎం కార్పొరేటర్ బిగంగారావు డిమాండ్ చేయనున్నారు. ఇదిలావుండగా కౌన్సిల్ సమావేశం సందర్భంగా ఏర్పాట్లను కమిషనర్ కేతన్‌గార్గ్ గురువారం పరిశీలించారు. కౌన్సిల్‌హాల్‌లోకి వెళ్లి మైక్‌ల పనితీరు, సభ్యులు కూర్చొనే కుర్చీలు, మేయర్ పోడియం, గ్యాలరీని పరిశీలించారు. అనధికారవ్యక్తులు లోపలకు రాకుండా అడ్డుకునేందుకు అధికారులకు కొన్ని సూచనలు చేశారు.

భారీ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

... 5వ పేజీ తరువాయి

చేశారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఆ బృందం సాంకేతిక ఆధారాలతో విశ్లేషణ చేసి నెల్లూరు జిల్లా కడవల మండలానికి చెందిన అర్జున్ జ్ఞానప్రకాశ్ (26), శ్రీకాకుళం జిల్లా గార మండలవాసి, ప్రస్తుతం నెల్లూరు జిల్లా మైపాడు మండలంలో ఉంటున్న లింగిబెడి రాంబాబు (30)ల హస్తం ఉన్నట్టు గుర్తించారు. వారిని తెలంగాణ రాష్ట్రం మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్టు చేశారు. వారు నేరాన్ని అంగీకరించడంతో పాటు చోరీకి అసలు సూత్రధారి నర్సీపట్నం ప్రాంతానికి చెందిన చిటికల నాగేశ్వరావు అలియస్ నగేశ్ (34)గా గుర్తించారు. అతడు గాజువాక బీసీ రోడ్డులో ఉన్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 72 తులాల బంగారు ఆభరణాలు, రూ.9.04 లక్షల నగదును స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు. కాగా నిందితుల్లో నాగేశ్వరరావుపై కాకినాడ, అనకాపల్లి, పశ్చిమగోదావరి తదితర జిల్లాల్లో మొత్తం ఎనిమిది కేసులు ఉన్నట్టు గుర్తించారు. అర్జున్ జ్ఞానప్రకాశ్, రాంబాబుల మీద తెలంగాణలో ఒక మర్డర్ కేసుతో పాటు నెల్లూరు తదితర ప్రాంతాల్లో ఐదుకు పైగా చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. నిందితుల మధ్య పాత పరిచయాలతో ముగ్గురూ కలిసి చోరీలకు పాల్పడుతుంటారని విచారణలో తేలిందని డీసీపీ వివరించారు.

రోజుకు 12 గంటలు పని!

... 5వ పేజీ తరువాయి

ఉత్పత్తి రాదు. ప్రస్తుతం ఇదే జరుగుతోంది. నైపుణ్యం కలిగిన కాంట్రాక్టు వర్కర్లను తీసేయడంతో ఆర్ఎంహెచ్‌పీలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఫలితంగా ఉత్పత్తి సగానికి పడిపోయింది. ఇక రైల్వే ర్యాక్‌ల ద్వారా ఆర్ఎంహెచ్‌పీకి వస్తున్న మెటీరియల్‌ను వెంట వెంటనే అన్‌లోడింగ్ చేయడం కూడా కొత్త కాంట్రాక్టు వర్కర్లకు చేతకావడం లేదు. ఎక్కువ సమయం పడుతోంది. ర్యాక్‌లు నిర్దిష్ట సమయం కంటే ఎక్కువ సేపు ఉంచుకుంటే రైల్వేకు డెమరేజీ కట్టాల్సి ఉంటుంది. గత జూన్ నుంచి నెలకు కోటి రూపాయలకు పైగా రైల్వేకు డెమరేజీ కడుతున్నారు. ఈ అదనపు వ్యయానికి సీఎండీ బాధ్యత వహించడం లేదు. దానిని కూడా విభాగాధిపతులపైకి నెడుతున్నారు. ఏ మంచి జరిగినా తన వల్లనే అంటూ...తప్పులు జరిగితే ఉద్యోగులు, కార్మికులే అంటూ ఢిల్లీకి సమాచారం ఇస్తున్నారు. ఈ తప్పుఒప్పుల లెక్కలు తేల్చడానికి కేంద్ర విజిలెన్స్ వర్గాలు రంగంలో దిగాల్సిన అవసరం చాలా ఉంది. నిజంగా విశాఖ ఉక్కును కాపాడాలని పాలకులు భావిస్తే విచారణకు ఆదేశాలు ఇవ్వాలని ఉద్యోగ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

డంపింగ్ యార్డులను తలపిస్తున్న స్టీల్‌ప్లాంటు క్వార్టర్స్ స్థలాలు

- నిర్వహణ లోపం.. యాజమాన్య నిర్లక్ష్యంతో చిట్టడవిని తలపిస్తున్న ప్రాంతాలు
- సర్పాలు, విష పురుగులు ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయంటూ స్థానికుల ఆవేదన
- అపరిశుభ్రతపై దృష్టి సారించిన జీవీఎంసీ


చెత్తాచెదారంతో నిండి అధ్వానంగా కనిపిస్తున్న రహదారి


క్వార్టర్స్ స్థలాల్లో గుబురుగా పెరిగిన పొదలు


హెచ్‌బీ కాలనీలోని స్టీల్‌ప్లాంటు స్థలాల్లో చెత్తకుప్పలు

వెంకోజీపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీలోని పోస్టాఫీసు సమీపంలోని రెండు దశాబ్దాల కిందట వరకు ఈ ప్రాంతమంతా స్టీల్‌ప్లాంటు ఉద్యోగుల కుటుంబాలతో సందడిగా ఉండేది. కాలక్రమేణా ఉద్యోగులు పదవీ విరమణ చెందడం, క్వార్టర్స్ ఖాళీ చేయడం, క్వార్టర్స్ అన్నీ ఖాళీగా మారిపోయింది. అలా ఖాళీ అయిన క్వార్టర్స్‌ను స్టీల్‌ప్లాంటు యాజమాన్యం చదును చేసి ఖాళీ స్థలాలుగా మార్చేసింది. అలా మార్చిన స్థలాలను స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ తరుణంలో ఆన్‌లైన్ ఆక్షన్ ద్వారా విక్రయించారు. అయితే వీటిలో కొన్ని అమ్ముడయ్యాయి, మరికొన్ని అమ్ముడవలేదు. ఇప్పుడా ఖాళీ స్థలాలన్నీ అడవులు, డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి.

నగరంలో ఎక్కడైనా ఖాళీ స్థలాలలో చెత్త నిల్వలు ఉంటే వాటిని తొలగించడంతో పాటు ఆ స్థల యజమానులకు అపరాధ రుసుం కూడా చెల్లించమని పదేపదే చెబుతున్న జీవీఎంసీ అధికారులు ఇక్కడ పరిస్థితి గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జోనల్ అధికారులకు గానీ, శానిటేషన్ అధికారులకు గానీ ఈ స్థలంలో పరిస్థితిని గమనించరా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ స్థలాల విషయమై స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంకు అపరాధ రుసుం విధిస్తున్నారా? అని అడుగుతున్నారు. పరిసర ప్రాంతాల వారు తమ ఇండ్లలోని చెత్తతో పాటు మరమ్మతు చేసుకునే ఇంటి డెబ్రిస్‌ను కూడా ఈ స్థలాల్లో పడేస్తున్నారు. అంతేకాకుండా ఇటీవల కురిసిన వర్షాలకు స్థలాల్లో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి స్థలాలన్నీ అడవులను తలపిస్తున్నాయి. అలాఏ ఈ ప్రాంతంలోని రోడ్లన్నీ చెత్తలు పేరుకపోయి అధ్వానంగా తయారవుతున్నాయి. స్వచ్ఛ భారత్.. స్వచ్ఛసర్వేక్షణ్ అని పదే పదే ఉన్నతాధికారులు చెబుతున్నా కిందస్థాయి అధికారులు, సిబ్బంది మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల కుక్కలు, ఒక్కో సమయంలో పాములు కూడా చుట్టు పక్కల నివసించే తమ ఇళ్లలోకి చొరబడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలని, ఈ స్థలాల్లో పేరుకుపోయిన తుప్పలు, చెత్త నిల్వలను తొలగించాలని తద్వారా చుట్టు పక్కలా రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు జోన్-3 ఆపరేషన్స్ విభాగం ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పైనాపిల్ కాలనీ 11 కేవీ అంబేడ్కర్ నగర్‌లో ఫీడర్ పనుల్లో భాగంగా చెట్ల కొమ్మలు నరికే కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు ఈ కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా అంబేడ్కర్ నగర్, వేంకటేశ్వర కాలనీ, ఎస్సీ, ఎస్టీ కాలనీ, దుర్గాబజార్, దుర్గాబజార్ చివరి బస్టాప్, పాండురంగాపురం, దుర్గానగర్, ఎస్కేఎల్ఎం నగర్, నెహ్రూ నగర్, జై భీంనగర్, శివశంకర్‌నగర్, లీలా సుందరనగర్, ఆరిలోవ పాత పోలీసు స్టేషన్, పైనాపిల్ కాలనీ, ఎస్ఎస్ఎన్ నగర్, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

యూజీడీ పనులకు శంకుస్థాపన


యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ మంగవేణి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని భూగర్భ డ్రైనేజీ పనులకు గురువారం వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి శంకుస్థాపన చేశారు. ఎంవీపీ కాలనీ పదో సెక్టరులో రూ.15 లక్షల జీవీఎంసీ నిధులతో భూగర్భ డ్రైనేజీ పనులను చేయనున్నారు.

గతంలో ఇక్కడ పనులు జరిగినప్పటికీ పైపులైన్లు పాడవడంతో, తాజాగా పనులు చేపట్టారు. కొత్త పైపు లైన్లను వేయనున్నట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పోలారావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బయో డైవర్సిటీ పార్కును సందర్శించిన మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు


పార్కులోని మొక్కలను పరిశీలిస్తున్న విద్యార్థినులు

పెదవాల్తేరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జీవవైవిధ్యం, పర్యావరణ అధ్యయన యాత్రలో భాగంగా నగరంలో పెదవాల్తేరు రాణిచంద్రమణి దేవి ఆస్పత్రి అవరణలో గల బయోడైవర్సిటీ పార్కును గురువారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ టిక్టర్ పాల్ డాక్టర్ ఎం.కీర్తి అధ్వర్యంలో ఇతర సభ్యులతో పాటు విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగాపార్కులోని సీతాకోక చిలుక పూర్తి జీవిత చక్ర దశలు, ఇతర విజ్ఞానదాయక అంశాలను చూసి ఆకర్షితులయ్యారు.

అనంతరం జీవ వైవిధ్య ఉద్యానవనం నిర్వాహకులు డాక్టర్ రామమూర్తి పలు అరుదైన మొక్కల గురించి విద్యార్థులకు వివరించారు. సెల్ఫ్ ఎక్స్‌ప్లనేటరీ బోర్డులతో అధ్యయనం చేస్తున్న వందలాది ఔషధ మొక్కలను చూసి పులకించారు.

విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాట్లు


వీధి లైట్లు వేస్తున్న దృశ్యం

ఆరిలోవ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలోని దీనదయాళ్‌పురంలో గురువారం ఏడు విద్యుత్ స్తంభాలు వీధిలైట్లను అమర్చారు. ఇక్కడ వీధిలైట్లు పాడవడంతో గత కొన్ని రోజులుగా ఇక్కడ రాత్రి వేళల్లో అంధకారం నెలకొంది. దీంతో కార్పొరేటర్ కెల్ల సునీత సత్యానారాయణ చొరవ తీసుకొని ఇక్కడ వీధిలైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. దీంతో గురువారం సాయంత్రం చీకటి పడే సరికి ఈ ప్రాంతం విద్యుత్ కాంతులతో నిండిపోయింది. చాలా రోజుల తర్వాత ఈ ప్రాంతంలో వీధి దీపాలు వెలగడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 47, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 26, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 22, బీరకాయలు 38, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 42, దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 58, బద్దచిక్కుడు 50, దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 75,కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 72, కీరదోస 34, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	101
లైవ్ ధర	121
విత్ స్కిన్	212
స్కిన్‌లెస్	222

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్


పై కప్పు పాడైన మ్యాన్‌హోల్

పెదవాల్తేరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 17వ వార్డు పెదవాల్తేరులోని విశాఖ ఐ ఆస్పత్రి రోడ్డు నుంచి పెదవాల్తేరు గ్రామంలోకి వెళ్లేమార్గంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్‌పై కప్పు పూర్తిగా పగిలిపోయి ప్రమాదకరంగా ఉంది. దీంతో వర్షం పడినప్పుడు మ్యాన్‌హోల్ నుంచి నీరు వరదలా పారుతోందని,ఈ మ్యాన్‌హోల్‌లో వాహనదారులు పడిపోయి ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలవుతున్నారని స్థానికులు తెలిపారు. దీనివల్ల ఈ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులను ఎదు ర్కొంటున్నారని వాపోయారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ సమస్యపై అధికారులు దృష్టి సారించి ఈ మ్యాన్‌హోల్ పై కప్పు మార్పివేతను చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనాదారులు కోరుతున్నారు.

వ్యూహాత్మకంగా స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు అడుగులు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆరోపణ


సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లాఅధ్యక్షుడు కేకేరాజు

మద్దిలపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు కేంద్రంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆరోపించారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు నాటి వైసీపీ ప్రభుత్వం కేంద్రానికి అడ్డుతగిలి ఆపగలిగిందన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ నగరానికి వచ్చి అఖిల సంఘాలతో సమావేశమై స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ఆపాలని అసెంబ్లీలో తీర్మానం చేశారని గుర్తుచేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా కూడా చేపట్టారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్రాన్ని ఎందుకు అడ్డుకోలేకపోతుందని ప్రశ్నించారు. కూటమి ఎంపీలతోనే కేంద్ర ప్రభుత్వం నిలబడిందని, ఇక్కడ ఎంపీలు తలచుకుంటే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగే అవకాశమే లేదన్నారు. కేంద్రప్రభుత్వం స్టీల్‌ప్లాంటుకు రూ.11.400 కోట్లు సహాయం ప్రకటించి ప్రజలకు మభ్యపెట్టిందన్నారు. ఆ నిధులు కూడా రూ.8500 కోట్లు మాత్రమే విడుదల చేసి జీఎస్టీలు, వీఆర్ఎస్ ఉద్యోగుల చెల్లింపులకు వినియోగించిందన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవం కాపాడలనుకుంటే ఎంపీలు స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు.

ముడుపుల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు


ముడుపులతో బారులు తీరిన భక్తులు

వెంకోజీపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని ముడుపుల వెంకన్న స్వామి ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. తమ కోరికలు తీర్చమని కోరుతూ వందలాది మంది భక్తులు ఆలయంలో కొత్తగా ముడుపులను కట్టుకున్నారు. ముడుపుల సమర్పించే భక్తులతో గ్రామంలోని వీధులు నిండిపోయాయి. ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా గ్రామ సేవా సంఘం సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి భక్తులు ఎటువంటి ఇబ్బంది లేకుండా స్వామి వారికి ముడుపుల సమర్పించేలా చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి కూడా స్వామి వారికి ముడుపుల చెల్లించేందుకు వస్తున్నారని సంఘం అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీలా ప్రేమ్‌కిరణ్ జగదీష్ పేర్కొన్నారు. గురువారం కట్టిన ముడుపులను తాము ఆలయంలో పొందుపరిచి వారికి టోకెన్లను ఇస్తామని, 7 శనివారాలు పాటు భక్తులు ఆ టోకెన్ ప్రకారం ముడుపులను తీసుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి, తమ కోరికలను కోరుకుంటారని, ఆఖరి వారం స్వామివారికి ముడుపులను సమర్పిస్తారని తెలిపారు. ఆలయం నిర్మించి 4 ఏళ్లు అయిందని, రోజురోజుకూ భక్తుల రద్దీ పెరుగుతోందని సంతోషం వ్యక్తం చేశారు.

23 నుంచి కళాభారతి జాతీయ పురస్కార సభలు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కళాభారతి నిర్వాహకులు మంతెన సత్యనారాయణ, గుమ్మలూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ తదితరులు

21ఎమ్‌డిపి1:మద్దిలపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కళాభారతి జాతీయ పురస్కార సభలు ఈనెల 23 నుంచి 28 వరకూ ఘనంగా నిర్వహించనున్నట్టు కళాభారతి అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ, కార్యదర్శి గుమ్మలూరి రాంబాబు తెలిపారు. పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 24 ఏళ్లగా ప్రతి ఏటా కళాభారతి ఆగస్టులో జాతీయ పురస్కార సభలతో పాటు ఆరు రోజులు సంగీత, నృత్య, నాటక ఉత్సవాలు నిర్వహిస్తోందన్నారు. ఉత్సవాల్లో భాగంగా 23న ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాద్‌రావుకు నాద విద్యాభారతి బిరుదుతో సత్కరించి, స్వర్ణ కమలం, రూ.లక్ష నగదు బహుమతి ప్రదానం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. సత్కారం అనంతరం ద్వారం సత్యానారాయణ వయోలిన్ వాయిద్య కచేరి ఉంటుందన్నారు. 24న కర్ణాటక, హిందుస్థానీ గాత్ర కచేరి, 25న విష్ణుభట్ల సిస్టర్స్ గాత్ర కచేరి, 26న బెంగళూరు బ్రదర్స్ గాత్ర కచేరి, 27న వసంత కిరణ్ ఆధ్వర్యంలో 33 మంది నృత్య కళాకారులతో హరిలీలా కల్పతరువు అనే నృత్య రూపకం, 28న శ్రీసాయిబాబా నాట్యమండలి నిర్వహణలో శ్రీఖడ్గ తిక్కన పద్య నాటకం ఉంటుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో పైడా కృష్ణప్రసాద్, గ్రంధి మల్లిక మనోజ్, పి.నరసింగరావు పాల్గొన్నారు.

'తెలుగు బిడ్డకు టీడీపీ మద్దతు ప్రకటించాలి'

వెంకోజీపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో రాజకీయాలకు సంబంధం లేని న్యాయకోవిదుడు జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఇండియా కూటమి అభ్యర్థిగా నిలబెట్టారని, తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ ప్రారంభించారని చెప్పే ఆ పార్టీ సుదర్శన్ రెడ్డికి మద్దతు పలకాలని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రియాంక దండి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు బిడ్డ వెంకయ్యానాయుడు ఉప రాష్ట్రపతిగా ఎన్నికైనప్పుడు పార్టీలకు అతీతంగా సహకరించారని, స్వర్గీయ ఎన్టీఆర్ కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధాని అభ్యర్థిగా పీవీ నరసింహారావు నంద్యాల నుంచి ఉప ఎన్నికలలో పోటీ చేసినప్పుడు ఆయనకి గౌరవం ఇచ్చి తెలుగువాడు దేశ ప్రధాని అవుతున్నారనే ఉద్దేశంతో టీడీపీ నుంచి అభ్యర్థిని పోటీ పెట్టలేదని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు తెలుగు వారు అత్యున్నత స్థాయిలో కూర్చునే అవకాశం వచ్చిందని, తెలుగుజాతి కోసం తాను నిలబడతానని పదే పదే చెబుతున్న చంద్రబాబునాయుడు.. జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : లాసన్స్‌బే కాలనీ శాంతి ఆశ్రమం ఎదురుగా ఫుట్‌పాత్‌పై పడిపోయిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎంవీపీ సీఐ మురళీ తెలిపిన వివరాలి ఉన్నాయి. బుధవారం ఉదయం పదిన్నర సమయంలో లాసన్స్‌బే కాలనీ శాంతి ఆశ్రమం ఎదురుగా ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు 108కి ఫోన్ చేయడంతో, వారు వచ్చి అతడిని కేజీహెచ్‌కు తరలించారు. నగరంలోని గ్రీన్ పార్కు హోటల్ సమీప పిఠానిదిబ్బ ప్రాంతానికి చెందిన మంగళగిరి వీర్రాజు(35)గా గుర్తించారు. అతడి వద్ద ఉన్న సెల్ ఫోన్ ద్వారా అతడికి సోదరి వరుసయ్యే రాజేశ్వరికి సమాచారం అందించారు. చికిత్స పొందుతూ అతడు గురువారం మృతి చెందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అధిక రక్తపోటుతో పాటు అనారోగ్య సమస్యతో వీర్రాజు మృతి చెంది ఉండవచ్చని కుటుంబసభ్యులు పేర్కొన్నట్టు పోలీసులు తెలిపారు.

జూకు ఐవోబీ బెంచీల వితరణ


జూకు బెంచీలను అందజేస్తున్న ఐవోబీ రీజనల్ మేనేజర్ రవికుమార్ గుప్తా

ఆరిలోవ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో సందర్శకులు సేద తీరేందుకు బెంచీలను ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు సీఎస్ఆర్ కింద 25 బెంచీలను అందజేసింది. వీటిని గురువారం జూ క్యూరేటర్ జి.మంగమ్మ సమక్షంలో జూకు బ్యాంకు రీజనల్ మేనేజర్ రవికుమార్ గుప్తా అందజేశారు. ఈ సందర్భంగా క్యూ రేటర్ మంగమ్మ బ్యాంకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐవోబీ చీఫ్ మేనేజర్ డి.శ్రీనివాసరావు, సీతమ్మధార బ్రాంచ్ హెడ్ సుష్మా, అసిస్టెంట్ మేనేజర్ కె.మురళీ, జూ పార్కు అసిస్టెంట్ క్యూరేటర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కేసులు పరిష్కారం

మహారాణిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వచ్చే నెల 13వ తేదీ వరకూ జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా చెప్పారు. గురువారం ఆయన జిల్లా కోర్టులో పోలీసు అధికారులు, న్యాయవాదులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉండి రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి పరిష్కరిం చాలని తెలిపారు. కేసుల పరిష్కారం ద్వారా సామాన్యులకు త్వరితగతిన న్యాయం అందుతుందన్నారు.

ఈ మార్గం.. మహా అధ్వానం


నెల రోజులుగా పడి ఉన్న కొమ్మలు


రోడ్డు పక్కన పడి ఉన్న పనికి రాని రేకులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ రెండో సెక్టరు, ఆరో సెక్టరులో ఉన్న రహదారి పొడవునా రోడ్డు పక్కన ఎప్పుడూ చెత్తాచెదారం దర్శనమిస్తూనే ఉంటుంది. స్మార్ట్ సిటీ పేరిట జీవీఎంసీ రూ.కోట్లు ఖర్చు చేస్తూ సుందరీకరణ చేపడుతుంటే, చక్కగా, ప్రణాళిక ప్రకారం నిర్మించిన కాలనీలో స్థానికుల్లో కొరవడిన అవగాహన, అధికారుల నిర్లక్ష్యం వెరసి రహదారి పక్కన చెత్తలు, ఇతర వ్యర్థాలు పోగుపడి కనిపిస్తుంటాయి. వెంకోజీపాలెం మెడికవర్ ఆస్పత్రి వెనుక భాగం నుంచి ఎంవీపీ కాలనీ రెండో సెక్టరు, ఆరో సెక్టరును కలుపుతూ డీఆర్‌డీఏ కార్యాలయం వరకూ విశాలమైన రహదారి ఉంది. ఈ దారిని ఆనుకునే అందమైన గౌతమ బుద్ధుడు భారీ విగ్రహం ఉన్న వీఎమ్మార్డీఏ హెల్త్ ఎరీనాకు ప్రధాన ద్వారం ఉంది. ఈ రహదారికి పక్కన కొన్ని చోట్ల ఎండిపోయిన చెట్ల కొమ్మలు గుట్టలుగా కనిపిస్తాయి. గట్టిగా వర్షం పడినప్పుడు చెట్ల కొమ్మలు విరిగి పడటం సహజం. అయితే ఈ కొమ్మలు నెలలు తరబడి ఇక్కడే వదిలేస్తున్నారు. ఓ చోట ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఎండిన కొమ్మలు ఉన్నాయి. అప్పుడప్పుడూ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పుడు ఎగజిమ్ముతుంటాయి. అందుకే ఎప్పుడైనా ఆ నిప్పులు ఎండిన కొమ్మలపై పడితే ప్రమాదమేనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల ఆయా భవనాలకు ఎదురుగా చెత్తాచెదారం, గృహనిర్మాణ వ్యర్థాలు పడేస్తుంటారు. అవి కూడా రోజుల తరబడి అలాగే పడి ఉంటాయి. ఇలాంటివి రహదారి పక్కన పడేసే వారికి జరిమానా విధిస్తే, ఇలాంటివి పునరావృతం కాకుండా ఉంటాయని ఈ ప్రాంతీయులు వ్యాఖ్యానిస్తున్నారు.

26న మట్టి విగ్రహాల పంపిణీ

అక్కయ్యపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నిరంతరం సమాజాభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తున్న జర్నలిస్టులకు ఈనెల 26న మట్టి గణపతి విగ్రహాలను ఆశీల్‌మెట్ట వేమన మందిరంలో ఉదయం 10 గంటల నుంచి పంపిణీ చేస్తున్నట్టు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ జర్నలిస్టుల యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

చవితికి పందిరి రాట



చవితి రాట వద్ద కమిటీ సభ్యులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 26వ వార్డు శంకువానిపాలెంలో న్యూ ఫ్రెండ్స్ సంపత్ వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 36వ వినాయక చవితి రాట మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు రాట వద్ద పూజలు నిర్వహించారు.

టికెట్ తనిఖీల్లో ప్రతిభ చూపిన వారికి డీఆర్ఎం అభినందన



టీటీలకు సర్టిఫికేట్లు అందించిన లలిత్ బోహ్రా

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్‌లో టికెట్ తనిఖీల ద్వారా ఉత్తమ ఫలితాలందించిన సిబ్బందిని డీఆర్ఎం లలిత్ బోహ్రా గురువారం తన చాంబర్‌లో సత్కరించి అభినందించారు. విజయనగరంలో విధులు నిర్వహిస్తున్న టీటీఐ వై.అప్పలరాజు 25 రోజుల్లో 836 కేసుల ద్వారా రూ.4,89,320, శ్రీకాకుళంలో పనిచేస్తున్న టీటీఐ కె.శ్రీనివాసరావు 21 రోజుల్లో 815 కేసుల ద్వారా రూ.4,42,900 జరిమానాలు వసూలు చేసి ప్రతిభను ప్రదర్శించారు. అంకిత భావంతో విధులు నిర్వహించి వాల్తేర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేయడం, ఈ ఏడాది మే నెలలో కమర్షియల్ విభాగం చేపట్టిన విస్తృత టికెట్ తనిఖీల జరిమానాలు ద్వారా వాల్తేరు డివిజన్‌కు రూ.2,41,20,627 సమకూర్చడం అభినందనీయమని డీఆర్ఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీసీఎం కె.సందీప్ పాల్గొన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో సివిల్ సర్వీసెస్ సాధ్యం : సీపీ

సీతంపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, నిరంతరం కృషి నిజమైన మూల సూత్రాలను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. తక్షశిల ఐఏఎస్ అకాడమీ సహకారంతో రూపుదిద్దుకున్న 'డిగ్రీ విత్ ఐఏఎస్ ప్రోగ్రామ్' కార్యక్రమన్ని లంకపల్లి బుల్లయ్య కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని పట్టుదల, అంకిత భావంతో కృషి చేయాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవాలని, దేశ పురోగతిలో సివిల్ సర్వేంట్లు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. తక్షశిల ఐఏఎస్ అకాడమీ ఈ దిశగా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి. మధుకుమార్ మాట్లాడుతూ కళాశాల ఎల్లప్పుడూ వినూత్న విద్యా కార్యక్రమాలను ప్రోత్సహిస్తోందని అన్నారు. తక్షశిల ఐఏఎస్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ బీఎస్ఎన్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అనేక మంది విద్యార్థులకు ఐఏఎస్, ఐపీఎస్ అవ్వడం ఒక లక్ష్యంగా మారిందని అన్నారు. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఒక ప్రయత్నమే డిగ్రీ విత్ ఐఏఎస్ కార్యక్రమమని తెలిపారు. అకాడమీ చీఫ్ మెంటర్ డాక్టర్ వరుణ్ దీప్ మాట్లాడుతూ సరైన శిక్షణ మార్గదర్శకత్వం పోటీ స్ఫూర్తి ద్వారా యువతను తీర్చిదిద్దడం అకాడమీ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



'డిగ్రీ విత్ ఐపీఎస్ ప్రోగ్రామ్'ను ప్రారంభిస్తున్న నగర సీపీ శంకబ్రత బాగ్చీ

చెడు వారితో స్నేహం తగదు :శక్తి బృందం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శక్తి బృందం

అక్కయ్యపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చెడు స్నేహాలు చేయవద్దని, చెడు మాటలకు ఆకర్షితులు అవ్వవద్దని ఈస్ట్ సబ్ డివిజన్ శక్తి బృందం సభ్యులు విద్యార్థులకు సూచించారు. ఎన్‌జీజీఓస్ కాలనీలో జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పలు అంశాల పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు విలాస జీవితాలకు అలవాటు పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. స్కూల్ విడిచి పెట్టిన వెంటనే ఇంటికి వెళ్లిపోవాలే తప్ప ఎక్కడా తిరగవద్దని, యూనిఫాంలో ఉండి తమకు బయట ఎక్కడ కనిపించినా డీఈవోతో మాట్లాడి స్కూల్ నుంచి పంపించేందుకు వెనుకాడమని అన్నారు. ఎవరైన అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి మంచి మార్గంలో నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జయంతి రాధాకుమారి, శక్తి బృందం సభ్యులు శ్యామ్ కుమార్, భాస్కర్‌రాజు, లావణ్య, రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలని నిరసన



నిరసన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మర్రిపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి పోషణ ట్రాకర్, రాష్ట్రానికి సంబంధించి బాల సంజీవనీ యాప్‌లతో పనిభారం పెరుగుతోందని, పనికి తగ్గా వేతనం చెల్లించాలని కోరుతూ మర్రిపాలెం ఆర్‌అండ్‌బీ జంక్షన్ వద్ద ఐసీడీఎస్ కార్యాలయం దగ్గర అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యశాఖకు చెందిన ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం ద్వారా ఏఎన్ఎం, ఆశవర్కర్లు చేయాల్సిన గర్భిణీ, బాలింతల నమోదు ప్రక్రియ కూడా తమకే అప్పగించడం వల్ల తమపై పనిభారం పెరుగుతోందని, దీంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైసీపీ హయాంలో వేతనాలు పెంచాలని పెద్దఎత్తున ఆందోళన చేపట్టినప్పుడు టీడీపీ నాయకులు తాము అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు ఏడాదిన్నర గడుస్తున్నా వేతనాలు పెంచే ఆలోచన చేయకపోవడం దారుణమన్నారు. అనంతరం సీడీపీవో నీలిమాకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో రైల్వే సంబంధిత సమస్యలు పరిష్కరించాలని వినతి



డీఆర్ఎం లలిత్ బోహ్రాకు వినతి పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, తదితర నాయకులు

సీతమ్మధార, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు గురువారం వాల్తేర్ డివిజన్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న రైల్వే సంబంధిత సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ధర్మానగర్, తిక్కవానిపాలెం, గాంధీనగర్ గ్రామాలకు సంబంధించిన ప్రధాన సమస్యలనుపై డీఆర్ఎంకు వినతి పత్రాన్ని అందజేశారు. దీంతో డీఆర్ఎం సానుకూలంగా స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రోజుకు 12 గంటలు పని!

... 5వ పేజీ తరువాయి

ఉత్పత్తి రాదు. ప్రస్తుతం ఇదే జరుగుతోంది. నైపుణ్యం కలిగిన కాంట్రాక్టు వర్కర్లను తీసేయడంతో ఆర్ఎంహెచ్‌పీలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఫలితంగా ఉత్పత్తి సగానికి పడిపోయింది.

ఇక రైల్వే ర్యాక్‌ల ద్వారా ఆర్ఎంహెచ్‌పీకి వస్తున్న మెటీరియల్‌ను వెంట వెంటనే అన్‌లోడింగ్ చేయడం కూడా కొత్త కాంట్రాక్టు వర్కర్లకు చేతకావడం లేదు. ఎక్కువ సమయం పడుతోంది. ర్యాక్‌లు నిర్ణీత సమయం కంటే ఎక్కువ సేపు ఉంచుకుంటే రైల్వేకు డెమరేజీ కట్టాల్సి ఉంటుంది. గత జూన్ నుంచి నెలకు కోటి రూపాయలకు పైగా రైల్వేకు డెమరేజీ కడుతున్నారు. ఈ అదనపు వ్యయానికి సీఎండీ బాధ్యత వహించడం లేదు. దానిని కూడా విభాగాధిపతులపైకి నెడుతున్నారు. ఏ మంచి జరిగినా తన వల్లనే అంటూ...తప్పులు జరిగితే ఉద్యోగులు, కార్మికులే అంటూ ఢిల్లీకి సమాచారం ఇస్తున్నారు. ఈ తప్పుఒప్పుల లెక్కలు తేల్చడానికి కేంద్ర విజిలెన్స్ వర్గాలు రంగంలో దిగాల్సిన అవసరం చాలా ఉంది. నిజంగా విశాఖ ఉక్కును కాపాడాలని పాలకులు భావిస్తే విచారణకు ఆదేశాలు ఇవ్వాలని ఉద్యోగ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

అక్రమ నిర్మాణాలు కోకొల్లలు

... 5వ పేజీ తరువాయి

వారు బిక్కుబిక్కుమంటూ కాలంగడుపుతునారు.

ప్రతీసందులోనూ అక్రమ నిర్మాణాలే

నగరంలో ఏ సందులో చూసినా అక్రమ నిర్మాణాలే కనిపిస్తున్నాయి. రెండు, మూడు అడుగులు దారి ఉండే సందుల్లో కూడా బహుళ అంతస్థుల భవనాలు నిర్మించేస్తున్నారు. సీతంపేట వినాయక ఆలయం సమీపంలో మూడు అడుగుల సందులో రెండు అపార్టుమెంట్‌లను జీవీఎంసీ ఇచ్చిన ప్లాన్ కంటే అదనంగా ఒక అంతస్థు నిర్మించడంతోపాటు కనీసం సెట్‌బ్యాక్‌లు కూడా విడిచిపెట్టలేదు. దీనిపై స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. మద్దిలపాలెం చేపలబజారు రోడ్డులో జీవీఎంసీ అధికారులు ఇచ్చిన ప్లాన్ కంటే అదనంగా రెండు అంతస్థులు నిర్మించినా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. అలాగే శివాజీపాలెం వినాయకుడి గుడి వెనుక సందులో జీ+2 నిర్మాణానికి జీవీఎంసీ ప్లాన్ జారీచేస్తే బిల్డర్ ఏకంగా రెండు అంతస్థులు అదనంగా నిర్మించేస్తున్నారు. దీనిపై కొందరు జీవీఎంసీకి ఫిర్యాదు చేస్తే టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండానే సమస్యను పరిష్కరించినట్టు ఫిర్యాదుదారుడికి సమాచారం పంపించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మద్దిలపాలెం దయారాం స్వీట్స్ వెనుక వైపు సందులో వ్యక్తిగత ఇల్లు నిర్మాణానికి జీవీఎంసీ అనుమతిస్తే అందులో ఏకంగా 16 ఫ్లాట్లతో భారీ అపార్టుమెంట్‌నే నిర్మించేశారు. నగరంలో ఇలాంటి నిర్మాణాలు కోకొల్లలుగా ఉంటున్నాసరే టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం పట్టనట్టు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్తులో దీనివల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిసినా సరే తమ వ్యక్తిగత లబ్ధిని దృష్టిలో పెట్టుకుని అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

వార్డు సచివాలయం నుంచే కలెక్షన్ మొదలు...

నగరంలో ఎవరైనా భవన నిర్మాణం చేయాలంటే ముందుగా లైసెన్స్‌డ్ సర్వేయర్ వద్దకు వెళ్లి స్థలానికి సంబంధించి పత్రాలు, భవనం డిజైన్, డ్రాయింగ్, సాయిల్ టెస్ట్ రిపోర్టును ఏపీడీపీఎంఎస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆ దరఖాస్తు సంబంధిత ప్రాంత వార్డు సచివాలయంలోని ప్లానింగ్ సెక్రటరీకి చేరుతుంది. అక్కడే వసూళ్ల పర్వం మొదలవుతుంది. దరఖాస్తును చూడగానే స్థలాన్ని చూడాలంటూ లైసెన్స్‌డ్ సర్వేయర్ ద్వారా వార్డు ప్లానింగ్ సెక్రటరీ భవన నిర్మాణదారుడిని కలుస్తాడు. స్థలంపై వివాదాలు, రోడ్డు సదుపాయం, నేల స్వభావం వంటివి పరిశీలించిన తర్వాత వాటిపై రిమార్కు రాసి ఉన్నతాధికారికి దరఖాస్తును పంపించాల్సి ఉంటుంది. కానీ భవనం స్థాయిని బట్టి అధికారులందరికీ ఇవ్వాలంటూ కొందరు కనీసం రూ.ఐదు నుంచి రూ.పది లక్షలు వసూలు వసూలుచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు అందితే వారం రోజుల్లో ప్లాన్ ఆన్‌లైన్‌లో ఆమోదం పొందేస్తుంది. అలా కానట్టయితే ఏవో కొర్రీలు కారణంగా నెలలపాటు పెండింగ్‌లో ఉండిపోతుంది. అనుకున్నంత డబ్బులు ఇచ్చేస్తే తర్వాత భవన నిర్మాణం వైపు టౌన్‌ప్లానింగ్ అధికారులు చూడడం లేదు. సెట్‌బ్యాక్‌లు వదలకపోయినా, రోడ్డు వెడల్పు అవసరమైనంత లేకపోయినా సరే అంతా సక్రమంగానే ఉన్నట్టు నిర్మాణదారుడికి అండగా నిలుస్తారు. జారీచేసిన ప్లాన్ కంటే అదనపు అంతస్థులు నిర్మిస్తే...అందుకు తగ్గట్టు వసూలు చేస్తున్నారు.

అన్నదానంలో లోపాలపై విచారణ శూన్యం

... 5వ పేజీ తరువాయి

బయోమెట్రిక్ తీసుకోవడం లేదని చాలా స్పష్టంగా వార్త ప్రచురిస్తే దానిపై బాధ్యులైన అధికారులను వివరణ కోరకుండా లేని బయోమెట్రిక్ వివరాలు సమర్పించాలని కోరడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

విశాఖలోని ఒక ఆలయంలో అన్నదానం విభాగం నుంచి లక్ష రూపాయలు ప్రతి నెలా ఉన్నతాధికారికి ఇవ్వడానికి అక్కడ బయోమెట్రిక్ అమలు చేయడం లేదు. రికార్డులు అన్నీ మాన్యువల్‌గా నచ్చినట్టు రాసుకుంటున్నారు. ఆ దేవస్థానంలో బయోమెట్రిక్ యంత్రాలు ఉన్నప్పటికీ, వాటితోనే భక్తుల సంఖ్య నమోదు చేయాలని ఉత్తర్వులు ఉన్నప్పటికీ పాటించకపోవడం అక్కడి అవకతవకలకు అద్దం పడుతోంది. ఇది పత్రికలో రాగానే బయోమెట్రిక్ అమలు చేయాలని ఆదేశించకుండా ఐదు జిల్లాల అధికారులు నివేదిక ఇవ్వాలని విజయవాడ అధికారులు కోరడం తప్పు చేసిన వారిని తప్పించడానికేనని దేవదాయ శాఖ వర్గాలు కోడై కూస్తున్నాయి. అన్నదానంలో డబ్బులు మిగలడానికి నాశిరకం దినుసులు వాడుతున్నారు. ఇప్పుడు వాటికి లేబొరేటరీ నివేదిక కోరుతున్నారు కాబట్టి వాటిని కూడా నకిలీవి తయారుచేసి పంపే అవకాశం ఉందనే అనుమానాలు కలుగుతున్నాయి. సింహాచలం దేవస్థానం సిబ్బందిని ఇటీవల తప్పనిసరిగా బదిలీ చేయాల్సి వచ్చింది. కమిషనర్ కార్యాలయం అధికారులు వారిని దూర ప్రాంతాలకు పంపకుండా స్థానికంగా ఉన్న కనకమహాలక్ష్మి ఆలయానికి బదిలీ చేశారు. ఒకరిద్దరిని దూరంగా వేసినా నెల రోజులు తిరగకుండానే మళ్లీ విశాఖపట్నం తీసుకువచ్చారు. ఇప్పుడు అక్కడే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాటిపై దృష్టిసారిస్తే కమిషనర్ కార్యాలయానికి కూడా సెగ తగిలే అవకాశం ఉండడంతో ఎటువంటి ప్రత్యేక విచారణ చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

కనక మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

మహారాణిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లో ఉన్న కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం గురువారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం చివరి గురువారం కావడంతో వేకువజామున అమ్మవారిని మేల్కొలిపి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

అంతర్జాతీయ విద్యకు డిమాండ్

మహారాణిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా అంతర్జాతీయ విద్యకు డిమాండ్ ఉందని ప్రముఖ విద్యావేత్త వినయ్‌శర్మ అన్నారు. జిల్లా పరిషత్ జంక్షన్‌లో ఉన్న ఒక సమావేశ మందిరంలో విద్యార్థుల్లో విద్యాధోరణి అన్న అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అంతర్జాతీయ విద్య పట్ల ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు. సదస్సులో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేవీలో కళా ఉత్సవాలు ప్రారంభం

మర్రిపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 104 ఏరియా కేంద్రీయ విద్యాలయంలో గురువారం నుంచి కళా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మేనేజింగ్ కమిటీ ఛైర్మన్ కమాండర్ ధీరజ్ కన్నా జ్యోతి ప్రజ్వలన చేసి, ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాలయంలో ఏటా నిర్వహిస్తున్న కళా ఉత్సవాలు విద్యార్థులకు ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయని, కళల పట్ల ఆసక్తి పెంపొందిస్తున్నాయని తెలిపారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. కాగా ఈనెల 21 నుంచి 23 వరకు జరిగే ఈ ఉత్సవాల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లోని 8 క్లస్టర్లలోని 72 పాఠశాలల నుంచి 420 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు.

బాల్ బ్యాడ్మింటన్ టోర్నీలో తూర్పు కోస్తా రైల్వే గెలుపు

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):వాల్తేరు రైల్వే స్పోర్ట్సు ఎరీనాలో జరుగుతున్న అఖిల భారత పురుషుల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ టోర్నీ ఆసక్తికరంగా సాగుతోంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య తూర్పు కోస్తా రైల్వే విజయం సాధించింది. సౌత్ సెంట్రల్ రైల్వేతో జరిగిన మ్యాచ్‌లో 2-0 స్కోరుతో గెలుపొంది పరువు నిలబెట్టుకోగా, మరో మ్యాచ్‌లో ఐసీఎఫ్ చేతిలో 2-0 స్కోరుతో ఓడింది. లీగ్ మ్యాచ్‌లో ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ వరుస విజయాలతో దూసుకుపోతోంది.

కుమార్తెలపై అత్యాచారం కేసులో ముద్దాయికి 20 ఏళ్లు జైలు

... 5వ పేజీ తరువాయి

పెద్ద కుమార్తె విషయాన్ని పాఠశాల టీచర్‌కు చెప్పింది. బాలిక తల్లిని టీచర్ పిలిచి విషయాన్ని వివరించింది. కుమార్తెల ఇద్దరి నుంచి నిజం తెలుసుకున్న తల్లి గత ఏడాది సెప్టెంబరు 14న ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దిశ పోలీస్ స్టేషన్ ఏసీపీ ఇ.వెంటారావు కేసు నమోదుచేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. బాధిత బాలికలు ప్రభుత్వం నుంచి పరిహారం పొందవచ్చునని తీర్పులో పేర్కొంటూ ఇందుకు తగిన న్యాయ సహాయం అందించాలని న్యాయసేవా ప్రాధికార సంస్థకు సూచించారు.



శారదా స్ట్రీట్ రోడ్డులో ఇరువైపులా వాహనాల పార్కింగ్



రోడ్డు పక్కన నిలిపివేసిన లారీ, ఇతర భారీ వాహనాలు

రోడ్డుపై భారీ వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు

డాబాగార్డెన్స్ ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : డాబాగార్డెన్స్‌లో రోడ్డుపై భారీ వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా లలితా కాలనీ, కృష్ణా గార్డెన్స్ ప్రాంతాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్డుకు సగానికి పైగా వాహనాల పార్కింగ్‌తో నిండిపోతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య కళ్ల ముందు కనిపిస్తున్నా అధికారుల్లో చలనం ఉండడం లేదు. సాయంత్రం వేళల్లో ఈ సమస్య మరింత జఠిలంగా మారుతోంది. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

నేడు డీఎస్సీ మెరిట్ జాబితా

... 5వ పేజీ తరువాయి

బృందాలను నియమించారు. అంటే 31 మంది ఎంఈవోలు, హెచ్ఎంలు, డీటీలకు డ్యూటీలు వేశారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఈ మేరకు విశాఖ డీఈవో ప్రేమ్‌కుమార్‌కు ఆదేశాలు జారీచేశారు. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో 1:1 ప్రాతిపదికగానే పిలుస్తున్నారు. అంటే 1,139 మందిని పిలుస్తారు. ఒకవేళ ఒక అభ్యర్థి రెండు, మూడు పోస్టులు దక్కించుకునే మార్కులు సంపాదిస్తే ఒక పోస్టును మాత్రమే అతను ఎంపిక చేసుకోవాలి. అటువంటి సందర్భాలలో సదరు అభ్యర్థి తరువాత మార్కులు తెచ్చుకునే అభ్యర్థికి అవకాశం ఇస్తారు. ఇక్కడ కూడా రోస్టర్ పాయింట్లను పరిగణనలోకి తీసుకుంటారు. సర్టిఫికెట్ల పరిశీలన ముగిసిన తరువాత నియామక పత్రాలు అందజేసే ప్రక్రియ చేపడతారు. దీనిపై స్పష్టత రావలసి ఉంది.

గవర్నమెంట్ అసిస్టెంట్ న్యాయవాదిగా సతీశ్‌కుమార్

డాబాగార్డెన్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అరవ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సీనియర్ డివిజన్ విశాఖపట్నం అసిస్టెంట్ గవర్నమెంట్ న్యాయవాదిగా సీనియర్ న్యాయవాది సావిలి సతీష్‌కుమార్ నియమితులయ్యారు. అరవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు సంబంధించి సివిల్ క్యాసెస్ మూడు సంవత్సరాల పాటు చూస్తారు. నెలకు రూ.18 వేలు హానరేరియం ఇస్తారని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ లీగల్‌అఫైర్స్ డిపార్ట్‌మెంట్ గొట్టాపు ప్రతిభా దేవి తెలిపారు. ఈమేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేవారు.

మూడు వార్డుల్లో అంధకారం



చీకటిగా ఉన్న సాలిగ్రామపురం

అక్కయ్యపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 44,45,46 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో చీకటి రాజ్యమేలుతోంది. దీనివల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొద్ది రోజులుగా నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న అక్కయ్యపాలెం సౌత్ బస్టాప్ వద్ద, కైలాసపురం, సాలిగ్రామపురం ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదని పలువురు చెబుతున్నారు. మహిళలు, యువతులు చీకటిలో రాకపోకలు సాగించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఆయా ప్రాంతాల్లో దొంగతనాలు కూడా జరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. వాహనదారులు హెడ్‌లైట్ల వెలుగులోనే ప్రయాణాలు సాగిస్తున్నారు. అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని నూతనంగా ఏర్పాటు చేసిన పార్కులో లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో చీకటిగా ఉంటోంది. అధికారులు తక్షణమే స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'లులూ'కు భూ కేటాయింపులు సరికాదు



మాట్లాడుతున్న రాణిశర్మ

డాబాగార్డెన్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్కే బీచ్‌లో లులూమాల్ సంస్థకు కేటాయించిన 14 ఎకరాలను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఆ స్థలంలో సైన్స్ సిటీ నిర్మించాలని ప్రముఖ సామాజిక కార్యకర్త, విశాఖ ప్రజా వనరుల పరిరక్షణ వేదిక ఛైర్‌పర్సన్ రాణిశర్మ కోరారు. గురువారం ఆమె డాబా గార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లులూ వద్దు- సైన్స్ సిటీ ముద్దు అన్న నినాదంతో ఉద్యమం చేస్తామని తెలిపారు. 99 ఏళ్లకు విలువైన భూములను నామమాత్ర లీజుకు ప్రభుత్వం ఇస్తుందని, మూడేళ్లు ఎటువంటి లీజు చెల్లించాల్సిన అవసరం లేదని జీఓ 137లో పేర్కొనడం సరికాదని చెప్పారు.ఆ సంస్థకు వందల కోట్ల రాయితీలు కూడా ఇచ్చారన్నారు. ఈ విషయమై సెప్టెంబరు 1న ప్రజాభిప్రాయ సేకరణ చేసి, తదుపరి ప్రజా బ్యాలెట్ నిర్వహిస్తామని ప్రకటించారు. విశాఖ పౌరుల అభిప్రాయం తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా విదేశీ సంస్థకు భూములు కేటాయించడం ప్రజా వ్యతిరేకమన్నారు. లులూ మాల్‌తో విశాఖలో అనేక షాపింగ్‌మాల్స్ డిపార్ట్‌మెంట్ స్టోర్స్ మూత పడతాయని తెలిపారు. నగరంలో ప్రజా వనరుల పరిరక్షణ కోసం చేస్తున్న ఈ ఉద్యమంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు.ఈ సమావేశంలో ఆ సంఘం కన్వీనర్ బి. గంగారావు, క్షేత్రపాల్, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భారీ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

... 5వ పేజీ తరువాయి

చేశారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఆ బృందం సాంకేతిక ఆధారాలతో విశ్లేషణ చేసి నెల్లూరు జిల్లా కడవల మండలానికి చెందిన అర్జున్ జ్ఞానప్రకాశ్ (26), శ్రీకాకుళం జిల్లా గార మండలవాసి, ప్రస్తుతం నెల్లూరు జిల్లా మైపాడు మండలంలో ఉంటున్న లింగిబెడి రాంబాబు (30)ల హస్తం ఉన్నట్టు గుర్తించారు. వారిని తెలంగాణ రాష్ట్రం మలకపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్టు చేశారు. వారు నేరాన్ని అంగీకరించడంతో పాటు చోరీకి అసలు సూత్రధారి నర్సీపట్నం ప్రాంతానికి చెందిన చిటికల నాగేశ్వరావు అలియస్ నగేశ్ (34)గా గుర్తించారు. అతడు గాజువాక బీసీ రోడ్డులో ఉన్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 72 తులాల బంగారు ఆభరణాలు, రూ.9.04 లక్షల నగదును స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు.

కాగా నిందితుల్లో నాగేశ్వరరావుపై కాకినాడ, అనకాపల్లి, పశ్చిమ గోదావరి తదితర జిల్లాల్లో మొత్తం ఎనిమిది కేసులు ఉన్నట్టు గుర్తించారు. అర్జున్ జ్ఞానప్రకాశ్, రాంబాబుల మీద తెలంగాణలో ఒక మర్డర్ కేసుతో పాటు నెల్లూరు తదితర ప్రాంతాల్లో ఐదుకు పైగా చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. నిందితుల మధ్య పాత పరిచయాలతో ముగ్గురూ కలిసి చోరీలకు పాల్పడుతుంటారని విచారణలో తేలిందని డీసీపీ వివరించారు.

వ్యూహప్రతివ్యూహాలు

... 5వ పేజీ తరువాయి

తొలగింపు, కోడివ్యర్థాల తరలింపులో నేతలు, అధికారుల ప్రమేయం, రోడ్లను శుభ్రం చేసే యంత్రాలను బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న కాంట్రాక్టర్‌కు అప్పగించడం వంటి అంశాలపై సభలో నిలదీయాలని వైసీపీ కార్పొరేటర్లు భావిస్తున్నారు. మరోవైపు కూటమిలోని అసంతృప్త కార్పొరేటర్లు సైతం తమవార్డులకు నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం, జోన్ల పునర్విభజన, క్లాప్ వాహనాల నిర్వహణ లోపభూయిష్టంగా తయారవ్వడం, కోడి వ్యర్థాల తరలింపులో కార్పొరేటర్లు, రౌడీషీటర్ల ప్రమేయం, పాతజైలురోడ్డులోని ఫుడ్‌కోర్ట్ తరలింపు, మెకానికల్ విభాగంలో జరుగుతున్న అవినీతిపై అధికారులను నిలదీయాలని భావిస్తున్నారు.

యూసీడీ ఆధ్వర్యంలో ఐదుచోట్ల ఆధునిక స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ల నిర్మాణం అంశం, వెండింగ్ కమిటీల ఎంపిక వంటి అంశాలపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది. కాగా స్టీల్‌ప్లాంటులోని ఒక్కో విభాగాన్ని ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించాలని సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు డిమాండ్ చేయనున్నారు. ఇదిలావుండగా కౌన్సిల్ సమావేశం సందర్భంగా ఏర్పాట్లను కమిషనర్ కేతన్‌గార్గ్ గురువారం పరిశీలించారు. కౌన్సిల్‌హాల్‌లోకి వెళ్లి మైక్‌ల పనితీరు, సభ్యులు కూర్చొనే కుర్చీలు, మేయర్ పోడియం, గ్యాలరీని పరిశీలించారు. అనధికారవ్యక్తులు లోపలకు రాకుండా అడ్డుకునేందుకు అధికారులకు కొన్ని సూచనలు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నిర్వాహణ మరమ్మతుల పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ పొలకి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మహారాణి పార్లర్ ఏరియా, నరసింహనగర్, గణేశ్‌నగర్, బాలయ్య శాస్త్రి లేఅవుట్, కైలాసపురం, శాంతినగర్, అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, ప్రజలు సహకరించాలని కోరారు.

డంపింగ్ యార్డులను తలపిస్తున్న స్టీల్‌ప్లాంటు క్వార్టర్స్ స్థలాలు

- నిర్వహణ లోపం.. యాజమాన్య నిర్లక్ష్యంతో చిట్టడవిని తలపిస్తున్న ప్రాంతాలు
- సర్పాలు, విష పురుగులు ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయంటూ స్థానికుల ఆవేదన
- అపరిశుభ్రతపై దృష్టి సారించిన జీవీఎంసీ



చెత్తాచెదారంతో నిండి అధ్వానంగా కనిపిస్తున్న రహదారి



క్వార్టర్స్ స్థలాల్లో గుబురుగా పెరిగిన పొదలు



హెచ్‌బీ కాలనీలోని స్టీల్‌ప్లాంటు స్థలాల్లో చెత్తకుప్పలు

వెంకోజీపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీలోని పోస్టాఫీసు సమీపంలోని రెండు దశాబ్దాల కిందట వరకు ఈ ప్రాంతమంతా స్టీల్‌ప్లాంటు ఉద్యోగుల కుటుంబాలతో సందడిగా ఉండేది. కాలక్రమేణా ఉద్యోగులు పదవీ విరమణ చెందడం, క్వార్టర్స్ ఖాళీ చేయడం, క్వార్టర్స్ అన్నీ ఖాళీగా మారిపోయింది. అలా ఖాళీ అయిన క్వార్టర్స్‌ను స్టీల్‌ప్లాంటు యాజమాన్యం చదును చేసి ఖాళీ స్థలాలుగా మార్చేసింది. అలా మార్చిన స్థలాలను స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ తరుణంలో ఆన్‌లైన్ ఆక్షన్ ద్వారా విక్రయించారు. అయితే వీటిలో కొన్ని అమ్ముడయ్యాయి, మరికొన్ని అమ్ముడవలేదు. ఇప్పుడా ఖాళీ స్థలాలన్నీ అడవులు, డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి.

నగరంలో ఎక్కడైనా ఖాళీ స్థలాలలో చెత్త నిల్వలు ఉంటే వాటిని తొలగించడంతో పాటు ఆ స్థల యజమానులకు అపరాధ రుసుం కూడా చెల్లించమని పదేపదే చెబుతున్న జీవీఎంసీ అధికారులు ఇక్కడ పరిస్థితి గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జోనల్ అధికారులకు గానీ, శానిటేషన్ అధికారులకు గానీ ఈ స్థలంలో పరిస్థితిని గమనించరా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ స్థలాల విషయమై స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంకు అపరాధ రుసుం విధిస్తున్నారా? అని అడుగుతున్నారు. పరిసర ప్రాంతాల వారు తమ ఇండ్లలోని చెత్తతో పాటు మరమ్మతు చేసుకునే ఇంటి డెబ్రిస్‌ను కూడా ఈ స్థలాల్లో పడేస్తున్నారు. అంతేకాకుండా ఇటీవల కురిసిన వర్షాలకు స్థలాల్లో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి స్థలాలన్నీ అడవులను తలపిస్తున్నాయి. అలాగే ఈ ప్రాంతంలోని రోడ్లన్నీ చెత్తలు పేరుకుపోయి అధ్వానంగా తయారవుతున్నాయి. స్వచ్ఛ భారత్.. స్వచ్ఛసర్వేక్షణ్ అని పదే పదే ఉన్నతాధికారులు చెబుతున్నా కిందస్థాయి అధికారులు, సిబ్బంది మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల కుక్కలు, ఒక్కో సమయంలో పాములు కూడా చుట్టు పక్కల నివసించే తమ ఇళ్లలోకి చొరబడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలని, ఈ స్థలాల్లో పేరుకుపోయిన తుప్పలు, చెత్త నిల్వలను తొలగించాలని తద్వారా చుట్టు పక్కలా రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.

23 నుంచి కళాభారతి జాతీయ పురస్కార సభలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కళాభారతి నిర్వాహకులు మంతెన సత్యనారాయణ, గుమ్మలూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ తదితరులు

21ఎమ్‌డిపి1:మద్దిలపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కళాభారతి జాతీయ పురస్కార సభలు ఈనెల 23 నుంచి 28 వరకూ ఘనంగా నిర్వహించనున్నట్టు కళాభారతి అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ, కార్యదర్శి గుమ్మలూరి రాంబాబు తెలిపారు. పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 24 ఏళ్లుగా ప్రతి ఏటా కళాభారతి ఆగస్టులో జాతీయ పురస్కార సభలతో పాటు ఆరు రోజులు సంగీత, నృత్య, నాటక ఉత్సవాలు నిర్వహిస్తోందన్నారు. ఉత్సవాల్లో భాగంగా 23న ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాద్‌రావుకు నాద విద్యాభారతి బిరుదుతో సత్కరించి, స్వర్ణ కమలం, రూ.లక్ష నగదు బహుమతి ప్రదానం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. సత్కారం అనంతరం ద్వారం సత్యానారాయణ వయోలిన్ వాయిద్య కచేరి ఉంటుందన్నారు. 24న కర్ణాటక, హిందుస్థానీ గాత్ర కచేరి, 25న విష్ణుభట్ల సిస్టర్స్ గాత్ర కచేరి, 26న బెంగళూరు బ్రదర్స్ గాత్ర కచేరి, 27న వసంత కిరణ్ ఆధ్వర్యంలో 33 మంది నృత్య కళాకారులతో హరిలీలా కల్పతరువు అనే నృత్య రూపకం, 28న శ్రీసాయిబాబా నాట్యమండలి నిర్వహణలో శ్రీఖడ్గ తిక్కన పద్య నాటకం ఉంటుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో పైడా కృష్ణప్రసాద్, గ్రంధి మల్లిక మనోజ్, పి.నరసింగరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు జోన్-3 ఆపరేషన్స్ విభాగం ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పైనాపిల్ కాలనీ 11 కేవీ అంబేడ్కర్ నగర్‌లో ఫీడర్ పనుల్లో భాగంగా చెట్ల కొమ్మలు నరికే కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు ఈ కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా అంబేడ్కర్ నగర్, వేంకటేశ్వర కాలనీ, ఎస్సీ, ఎస్టీ కాలనీ, దుర్గాబజార్, దుర్గాబజార్ చివరి బస్టాప్, పాండురంగాపురం, దుర్గానగర్, ఎస్కేఎల్ఎం నగర్, నెహ్రూ నగర్, జై భీంనగర్, శివశంకర్‌నగర్, లీలా సుందరనగర్, ఆరిలోవ పాత పోలీసు స్టేషన్, పైనాపిల్ కాలనీ, ఎస్ఎస్ఎన్ నగర్, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

యూజీడీ పనులకు శంకుస్థాపన



యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ మంగవేణి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని భూగర్భ డ్రైనేజీ పనులకు గురువారం వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి శంకుస్థాపన చేశారు. ఎంవీపీ కాలనీ పదో సెక్టరులో రూ.15 లక్షల జీవీఎంసీ నిధులతో భూగర్భ డ్రైనేజీ పనులను చేయనున్నారు.

గతంలో ఇక్కడ పనులు జరిగినప్పటికీ పైపులైన్లు పాడవడంతో, తాజాగా పనులు చేపట్టారు. కొత్త పైపు లైన్లను వేయనున్నట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పోలారావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బయో డైవర్సిటీ పార్కును సందర్శించిన మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు



పార్కులోని మొక్కలను పరిశీలిస్తున్న విద్యార్థినులు

పెదవాల్తేరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జీవవైవిధ్యం, పర్యావరణ అధ్యయన యాత్రలో భాగంగా నగరంలో పెదవాల్తేరు రాణిచంద్రమణి దేవి ఆస్పత్రి అవరణలో గల బయోడైవర్సిటీ పార్కును గురువారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ టిక్లర్ పాల్ డాక్టర్ ఎం.కీర్తి అధ్వర్యంలో ఇతర సభ్యులతో పాటు విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగాపార్కులోని సీతాకోక చిలుక పూర్తి జీవిత చక్ర దశలు, ఇతర విజ్ఞానదాయక అంశాలను చూసి ఆకర్షితులయ్యారు.

అనంతరం జీవ వైవిధ్య ఉద్యానవనం నిర్వాహకులు డాక్టర్ రామమూర్తి పలు అరుదైన మొక్కల గురించి విద్యార్థులకు వివరించారు. సెల్ఫ్ ఎక్స్‌ప్లనేటరీ బోర్డులతో అధ్యయనం చేస్తున్న వందలాది ఔషధ మొక్కలను చూసి పులకించారు.

'తెలుగు బిడ్డకు టీడీపీ మద్దతు ప్రకటించాలి'

వెంకోజీపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో రాజకీయాలకు సంబంధం లేని న్యాయకోవిదుడు జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఇండియా కూటమి అభ్యర్థిగా నిలబెట్టారని, తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ ప్రారంభించారని చెప్పే ఆ పార్టీ సుదర్శన్ రెడ్డికి మద్దతు పలకాలని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రియాంక దండి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు బిడ్డ వెంకయ్యానాయుడు ఉప రాష్ట్రపతిగా ఎన్నికైనప్పుడు పార్టీలకు అతీతంగా సహకరించారని, స్వర్గీయ ఎన్టీఆర్ కూడా కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధాని అభ్యర్థిగా పీవీ నరసింహారావు నంద్యాల నుంచి ఉప ఎన్నికలలో పోటీ చేసినప్పుడు ఆయనకి గౌరవం ఇచ్చి తెలుగువాడు దేశ ప్రధాని అవుతున్నారనే ఉద్దేశంతో టీడీపీ నుంచి అభ్యర్థిని పోటీ పెట్టలేదని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు తెలుగు వారు అత్యున్నత స్థాయిలో కూర్చునే అవకాశం వచ్చిందని, తెలుగుజాతి కోసం తాను నిలబడతానని పదే పదే చెబుతున్న చంద్రబాబునాయుడు.. జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : లాసన్స్‌బే కాలనీ శాంతి ఆశ్రమం ఎదురుగా ఫుట్‌పాత్‌పై పడిపోయిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎంవీపీ సీఐ మురళీ తెలిపిన వివరాలి ఉన్నాయి. బుధవారం ఉదయం పదిన్నర సమయంలో లాసన్స్‌బే కాలనీ శాంతి ఆశ్రమం ఎదురుగా ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు 108కి ఫోన్ చేయడంతో, వారు వచ్చి అతడిని కేజీహెచ్‌కు తరలించారు. నగరంలోని గ్రీన్ పార్కు హోటల్ సమీప పిఠానిదిబ్బ ప్రాంతానికి చెందిన మంగళగిరి వీర్రాజు(35)గా గుర్తించారు. అతడి వద్ద ఉన్న సెల్ ఫోన్ ద్వారా అతడికి సోదరి వరుసయ్యే రాజేశ్వరికి సమాచారం అందించారు. చికిత్స పొందుతూ అతడు గురువారం మృతి చెందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అధిక రక్తపోటుతో పాటు అనారోగ్య సమస్యతో వీర్రాజు మృతి చెంది ఉండవచ్చని కుటుంబసభ్యులు పేర్కొన్నట్టు పోలీసులు తెలిపారు.

విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాట్లు



వీధి లైట్లు వేస్తున్న దృశ్యం

ఆరిలోవ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలోని దీనదయాళ్‌పురంలో గురువారం ఏడు విద్యుత్ స్తంభాలు వీధిలైట్లను అమర్చారు. ఇక్కడ వీధిలైట్లు పాడవడంతో గత కొన్ని రోజులుగా ఇక్కడ రాత్రి వేళల్లో అంధకారం నెలకొంది. దీంతో కార్పొరేటర్ కెల్ల సునీత సత్యానారాయణ చొరవ తీసుకొని ఇక్కడ వీధిలైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. దీంతో గురువారం సాయంత్రం చీకటి పడే సరికి ఈ ప్రాంతం విద్యుత్ కాంతులతో నిండిపోయింది. చాలా రోజుల తర్వాత ఈ ప్రాంతంలో వీధి దీపాలు వెలగడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

వ్యూహాత్మకంగా స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు అడుగులు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లాఅధ్యక్షుడు కేకేరాజు

మద్దిలపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు కేంద్రంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆరోపించారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు నాటి వైసీపీ ప్రభుత్వం కేంద్రానికి అడ్డుతగిలి ఆపగలిగిందన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ నగరానికి వచ్చి అఖిల సంఘాలతో సమావేశమై స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ఆపాలని అసెంబ్లీలో తీర్మానం చేశారని గుర్తుచేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా కూడా చేపట్టారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్రాన్ని ఎందుకు అడ్డుకోలేకపోతుందని ప్రశ్నించారు. కూటమి ఎంపీలతోనే కేంద్ర ప్రభుత్వం నిలబడిందని, ఇక్కడ ఎంపీలు తలచుకుంటే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగే అవకాశమే లేదన్నారు. కేంద్రప్రభుత్వం స్టీల్‌ప్లాంటుకు రూ.11,400 కోట్లు సహాయం ప్రకటించి ప్రజలకు మభ్యపెట్టిందన్నారు. ఆ నిధులు కూడా రూ.8500 కోట్లు మాత్రమే విడుదల చేసి జీఎస్టీలు, వీఆర్ఎస్ ఉద్యోగుల చెల్లింపులకు వినియోగించిందన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవం కాపాడలనుకుంటే ఎంపీలు స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు.

జూకు ఐవోబీ బెంచీల వితరణ



జూకు బెంచీలను అందజేస్తున్న ఐవోబీ రీజనల్ మేనేజర్ రవికుమార్ గుప్తా

ఆరిలోవ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో సందర్శకులు సేద తీరేందుకు బెంచీలను ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు సీఎస్ఆర్ కింద 25 బెంచీలను అందజేసింది. వీటిని గురువారం జూ క్యూరేటర్ జి.మంగమ్మ సమక్షంలో జూకు బ్యాంకు రీజనల్ మేనేజర్ రవికుమార్ గుప్తా అందజేశారు. ఈ సందర్భంగా క్యూ రేటర్ మంగమ్మ బ్యాంకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐవోబీ చీఫ్ మేనేజర్ డి.శ్రీనివాసరావు, సీతమ్మధార బ్రాంచ్ హెడ్ సుష్మా, అసిస్టెంట్ మేనేజర్ కె.మురళీ, జూ పార్కు అసిస్టెంట్ క్యూరేటర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కేసులు పరిష్కారం

మహారాణిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వచ్చే నెల 13వ తేదీ వరకూ జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా చెప్పారు. గురువారం ఆయన జిల్లా కోర్టులో పోలీసు అధికారులు, న్యాయవాదులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉండి రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. కేసుల పరిష్కారం ద్వారా సామాన్యులకు త్వరితగతిన న్యాయం అందుతుందన్నారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



పై కప్పు పాడైన మ్యాన్‌హోల్

పెదవాల్తేరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 17వ వార్డు పెదవాల్తేరులోని విశాఖ ఐ ఆస్పత్రి రోడ్డు నుంచి పెదవాల్తేరు గ్రామంలోకి వెళ్లేమార్గంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్‌పై కప్పు పూర్తిగా పగిలిపోయి ప్రమాదకరంగా ఉంది. దీంతో వర్షం పడినప్పుడు మ్యాన్‌హోల్ నుంచి నీరు వరదలా పారుతోందని,ఈ మ్యాన్‌హోల్‌లో వాహనదారులు పడిపోయి ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలవుతున్నారని స్థానికులు తెలిపారు. దీనివల్ల ఈ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులను ఎదు ర్కొంటున్నారని వాపోయారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఈ సమస్యపై అధికారులు దృష్టి సారించి ఈ మ్యాన్‌హోల్ పై కప్పు మార్పివేతను చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనాదారులు కోరుతున్నారు.

ముడుపుల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



ముడుపులతో బారులు తీరిన భక్తులు

వెంకోజీపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని ముడుపుల వెంకన్న స్వామి ఆలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. తమ కోరికలు తీర్చమని కోరుతూ వందలాది మంది భక్తులు ఆలయంలో కొత్తగా ముడుపులను కట్టుకున్నారు. ముడుపుల సమర్పించే భక్తులతో గ్రామంలోని వీధులు నిండిపోయాయి. ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా గ్రామ సేవా సంఘం సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి భక్తులు ఎటువంటి ఇబ్బంది లేకుండా స్వామి వారికి ముడుపుల సమర్పించేలా చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి కూడా స్వామి వారికి ముడుపుల చెల్లించేందుకు వస్తున్నారని సంఘం అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీలా ప్రేమ్‌కిరణ్ జగదీష్ పేర్కొన్నారు. గురువారం కట్టిన ముడుపులను తాము ఆలయంలో పొందుపరిచి వారికి టోకెన్లను ఇస్తామని, 7 శనివారాలు పాటు భక్తులు ఆ టోకెన్ ప్రకారం ముడుపులను తీసుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి, తమ కోరికలను కోరుకుంటారని, ఆఖరి వారం స్వామివారికి ముడుపులను సమర్పిస్తారని తెలిపారు. ఆలయం నిర్మించి 4 ఏళ్ల అయిందని, రోజురోజుకూ భక్తుల రద్దీ పెరుగుతోందని సంతోషం వ్యక్తం చేశారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 47, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 26, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 22, బీరకాయలు 38, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 42, దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 70, బరబాటి 32, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 58, బద్దచిక్కుడు 50, దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 75,కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 72, కీరదోస 34, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, క్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు — బ్యాగ్

రైతు ధర	101
లైవ్ ధర	121
విత్ స్కిన్	212
స్కిన్‌లెస్	222

ఈ మార్గం.. మహా అధ్వానం



నెల రోజులుగా పడి ఉన్న కొమ్మలు



రోడ్డు పక్కన పడి ఉన్న పనికి రాని రేకులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ రెండో సెక్టరు, ఆరో సెక్టరులో ఉన్న రహదారి పొడవునా రోడ్డు పక్కన ఎప్పుడూ చెత్తాచెదారం దర్శనమిస్తూనే ఉంటుంది. స్మార్ట్ సిటీ పేరిట జీవీఎంసీ రూ.కోట్లు ఖర్చు చేస్తూ సుందరీకరణ చేపడుతుంటే, చక్కగా, ప్రణాళిక ప్రకారం నిర్మించిన కాలనీలో స్థానికుల్లో కొరవడిన అవగాహన, అధికారుల నిర్లక్ష్యం వెరసి రహదారి పక్కన చెత్తలు, ఇతర వ్యర్థాలు పోగుపడి కనిపిస్తుంటాయి. వెంకోజీపాలెం మెడికవర్ ఆస్పత్రి వెనుక భాగం నుంచి ఎంవీపీ కాలనీ రెండో సెక్టరు, ఆరో సెక్టరును కలుపుతూ డీఆర్‌డీఏ కార్యాలయం వరకూ విశాలమైన రహదారి ఉంది. ఈ దారిని ఆనుకునే అందమైన గౌతమ బుద్ధుడు భారీ విగ్రహం ఉన్న వీఎమ్మార్డీఏ హెల్త్ ఎరీనాకు ప్రధాన ద్వారం ఉంది. ఈ రహదారికి పక్కన కొన్ని చోట్ల ఎండిపోయిన చెట్ల కొమ్మలు గుట్టలుగా కనిపిస్తాయి. గట్టిగా వర్షం పడినప్పుడు చెట్ల కొమ్మలు విరిగి పడటం సహజం. అయితే ఈ కొమ్మలు నెలలు తరబడి ఇక్కడే వదిలేస్తున్నారు. ఓ చోట ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఎండిన కొమ్మలు ఉన్నాయి. అప్పుడప్పుడూ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పుడు ఎగజిమ్ముతుంటాయి. అందుకే ఎప్పుడైనా ఆ నిప్పులు ఎండిన కొమ్మలపై పడితే ప్రమాదమేనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల ఆయా భవనాలకు ఎదురుగా చెత్తాచెదారం, గృహనిర్మాణ వ్యర్థాలు పడేస్తుంటారు. అవి కూడా రోజుల తరబడి అలాగే పడి ఉంటాయి. ఇలాంటివి రహదారి పక్కన పడేసే వారికి జరిమానా విధిస్తే, ఇలాంటివి పునరావృతం కాకుండా ఉంటాయని ఈ ప్రాంతీయులు వ్యాఖ్యానిస్తున్నారు.

26న మట్టి విగ్రహాల పంపిణీ

అక్కయ్యపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నిరంతరం సమాజాభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తున్న జర్నలిస్టులకు ఈనెల 26న మట్టి గణపతి విగ్రహాలను ఆశీల్‌మెట్ట వేమన మందిరంలో ఉదయం 10 గంటల నుంచి పంపిణీ చేస్తున్నట్టు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ జర్నలిస్టుల యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

చవితికి పందిరి రాట


చవితి రాట వద్ద కమిటీ సభ్యులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 26వ వార్డు శంకువానిపాలెంలో న్యూ ఫ్రెండ్స్ సంపత్ వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 36వ వినాయక చవితి రాట మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు రాట వద్ద పూజలు నిర్వహించారు.

టికెట్ తనిఖీల్లో ప్రతిభ చూపిన వారికి డీఆర్‌ఎం అభినందన


టీటీలకు సర్టిఫికేట్లు అందించిన లలిత్ బోహ్రా

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్‌లో టికెట్ తనిఖీల ద్వారా ఉత్తమ ఫలితాలందించిన సిబ్బందిని డీఆర్‌ఎం లలిత్ బొహ్రా గురువారం తన చాంబర్‌లో సత్కరించి అభినందించారు. విజయనగరంలో విధులు నిర్వహిస్తున్న టీటీఐ వై.అప్పలరాజు 25 రోజుల్లో 836 కేసుల ద్వారా రూ.4,89,320, శ్రీకాకుళంలో పనిచేస్తున్న టీటీఐ కె.శ్రీనివాసరావు 21 రోజుల్లో 815 కేసుల ద్వారా రూ.4,42,900 జరిమానాలు వసూలు చేసి ప్రతిభను ప్రదర్శించారు. అంకిత భావంతో విధులు నిర్వహించి వాల్తేర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేయడం, ఈ ఏడాది మే నెలలో కమర్షియల్ విభాగం చేపట్టిన విస్తృత టికెట్ తనిఖీల జరిమానాలు ద్వారా వాల్తేరు డివిజన్‌కు రూ.2,41,20,627 సమకూర్చడం అభినందనీయమని డీఆర్‌ఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీసీఎం కె.సందీప్ పాల్గొన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో సివిల్ సర్వీసెస్ సాధ్యం : సీపీ


'డిగ్రీ విత్ ఐఏఎస్ ప్రోగ్రామ్'ను ప్రారంభిస్తున్న నగర సీపీ శంకబ్రత బాగ్చీ

సీతంపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, నిరంతరం కృషి నిజమైన మూల సూత్రాలను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. తక్షశిల ఐఏఎస్ అకాడమీ సహకారంతో రూపుదిద్దుకున్న 'డిగ్రీ విత్ ఐఏఎస్ ప్రోగ్రామ్' కార్యక్రమన్ని లంకపల్లి బుల్లయ్య కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని పట్టుదల, అంకిత భావంతో కృషి చేయాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవాలని, దేశ పురోగతిలో సివిల్ సర్వెంట్లు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. తక్షశిల ఐఏఎస్ అకాడమీ ఈ దిశగా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి. మధుకుమార్ మాట్లాడుతూ కళాశాల ఎల్లప్పుడూ వినూత్న విద్యా కార్యక్రమాలను ప్రోత్సహిస్తోందని అన్నారు. తక్షశిల ఐఏఎస్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ బీఎస్ఎన్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అనేక మంది విద్యార్థులకు ఐఏఎస్, ఐపీఎస్ అవ్వడం ఒక లక్ష్యంగా మారిందని అన్నారు. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఒక ప్రయత్నమే డిగ్రీ విత్ ఐఏఎస్ కార్యక్రమమని తెలిపారు. అకాడమీ చీఫ్ మెంటర్ డాక్టర్ వరుణ్ దీప్ మాట్లాడుతూ సరైన శిక్షణ మార్గదర్శకత్వం పోటీ స్ఫూర్తి ద్వారా యువతను తీర్చిదిద్దడం అకాడమీ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెడు వారితో స్నేహం తగదు :శక్తి బృందం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శక్తి బృందం

అక్కయ్యపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చెడు స్నేహాలు చేయవద్దని, చెడు మాటలకు ఆకర్షితులు అవ్వవద్దని ఈస్ట్ సబ్ డివిజన్ శక్తి బృందం సభ్యులు విద్యార్థులకు సూచించారు. ఎన్‌జీజీఓస్ కాలనీలో జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పలు అంశాల పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు విలాస జీవితాలకు అలవాటు పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. స్కూల్ విడిచి పెట్టిన వెంటనే ఇంటికి వెళ్లిపోవాలే తప్ప ఎక్కడా తిరగవద్దని, యూనిఫాంలో ఉండి తమకు బయట ఎక్కడ కనిపించినా డీఈవోతో మాట్లాడి స్కూల్ నుంచి పంపించేందుకు వెనుకాడమని అన్నారు. ఎవరైన అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి మంచి మార్గంలో నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జయంతి రాధాకుమారి, శక్తి బృందం సభ్యులు శ్యామ్ కుమార్, భాస్కర్‌రాజు, లావణ్య, రూపాదేవి తదితరులు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలని నిరసన


నిరసన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మర్రిపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి పోషణ ట్రాకర్, రాష్ట్రానికి సంబంధించి బాల సంజీవనీ యాప్‌లతో పనిభారం పెరుగుతోందని, పనికి తగ్గా వేతనం చెల్లించాలని కోరుతూ మర్రిపాలెం ఆర్అండ్‌బీ జంక్షన్ వద్ద ఐసీడీఎస్ కార్యాలయం దగ్గర అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యశాఖకు చెందిన ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం ద్వారా ఏఎన్‌ఎం, ఆశవర్కర్లు చేయాల్సిన గర్భిణీ, బాలింతల నమోదు ప్రక్రియ కూడా తమకే అప్పగించడం వల్ల తమపై పనిభారం పెరుగుతోందని, దీంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైసీపీ హయాంలో వేతనాలు పెంచాలని పెద్దఎత్తున ఆందోళన చేపట్టినప్పుడు టీడీపీ నాయకులు తాము అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు ఏడాదిన్నర గడుస్తున్నా వేతనాలు పెంచే ఆలోచన చేయకపోవడం దారుణమన్నారు. అనంతరం సీడీపీవో నీలిమాకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అంజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో రైల్వే సంబంధిత సమస్యలు పరిష్కరించాలని వినతి


డీఆర్‌ఎం లలిత్ బోహ్రాకు వినతి పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, తదితర నాయకులు

సీతమ్మధార, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు గురువారం వాల్తేర్ డివిజన్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న రైల్వే సంబంధిత సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ధర్మానగర్, తిక్కవానిపాలెం, గాంధీనగర్ గ్రామాలకు సంబంధించిన ప్రధాన సమస్యలనుపై డీఆర్‌ఎంకు వినతి పత్రాన్ని అందజేశారు. దీంతో డీఆర్‌ఎం సానుకూలంగా స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రోజుకు 12 గంటలు పని!

... 5వ పేజీ తరువాయి

ఉత్పత్తి రాదు. ప్రస్తుతం ఇదే జరుగుతోంది. నైపుణ్యం కలిగిన కాంట్రాక్టు వర్కర్లను తీసేయడంతో ఆర్‌ఎంహెచ్‌పీలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఫలితంగా ఉత్పత్తి సగానికి పడిపోయింది.

ఇక రైల్వే ర్యాక్‌ల ద్వారా ఆర్‌ఎంహెచ్‌పీకి వస్తున్న మెటీరియల్‌ను వెంట వెంటనే అన్‌లోడింగ్ చేయడం కూడా కొత్త కాంట్రాక్టు వర్కర్లకు చేతకావడం లేదు. ఎక్కువ సమయం పడుతోంది. ర్యాక్‌లు నిర్ణీత సమయం కంటే ఎక్కువ సేపు ఉంచుకుంటే రైల్వేకు డెమరేజీ కట్టాల్సి ఉంటుంది. గత జూన్ నుంచి నెలకు కోటి రూపాయలకు పైగా రైల్వేకు డెమరేజీ కడుతున్నారు. ఈ అదనపు వ్యయానికి సీఎండీ బాధ్యత వహించడం లేదు. దానిని కూడా విభాగాధిపతులపైకి నెడుతున్నారు. ఏ మంచి జరిగినా తన వల్లనే అంటూ...తప్పులు జరిగితే ఉద్యోగులు, కార్మికులే అంటూ ఢిల్లీకి సమాచారం ఇస్తున్నారు. ఈ తప్పుఒప్పుల లెక్కలు తేల్చడానికి కేంద్ర విజిలెన్స్ వర్గాలు రంగంలో దిగాల్సిన అవసరం చాలా ఉంది. నిజంగా విశాఖ ఉక్కును కాపాడాలని పాలకులు భావిస్తే విచారణకు ఆదేశాలు ఇవ్వాలని ఉద్యోగ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

అక్రమ నిర్మాణాలు కోకొల్లలు

... 5వ పేజీ తరువాయి

వారు బిక్కుబిక్కుమంటూ కాలంగడుపుతునారు.

ప్రతీసందులోనూ అక్రమ నిర్మాణాలే

నగరంలో ఏ సందులో చూసినా అక్రమ నిర్మాణాలే కనిపిస్తున్నాయి. రెండు, మూడు అడుగులు దారి ఉండే సందుల్లో కూడా బహుళ అంతస్థుల భవనాలు నిర్మించేస్తున్నారు. సీతంపేట వినాయక ఆలయం సమీపంలో మూడు అడుగుల సందులో రెండు అపార్టుమెంట్‌లను జీవీఎంసీ ఇచ్చిన ప్లాన్ కంటే అదనంగా ఒక అంతస్థు నిర్మించడంతోపాటు కనీసం సెట్‌బ్యాక్‌లు కూడా విడిచిపెట్టలేదు. దీనిపై స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. మద్దిలపాలెం చేపలబజారు రోడ్డులో జీవీఎంసీ అధికారులు ఇచ్చిన ప్లాన్ కంటే అదనంగా రెండు అంతస్థులు నిర్మించినా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. అలాగే శివాజీపాలెం వినాయకుడి గుడి వెనుక సందులో జీ+2 నిర్మాణానికి జీవీఎంసీ ప్లాన్ జారీచేస్తే బిల్డర్ ఏకంగా రెండు అంతస్థులు అదనంగా నిర్మించేస్తున్నారు. దీనిపై కొందరు జీవీఎంసీకి ఫిర్యాదు చేస్తే టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండానే సమస్యను పరిష్కరించినట్టు ఫిర్యాదుదారుడికి సమాచారం పంపించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మద్దిలపాలెం దయారాం స్వీట్స్ వెనుక వైపు సందులో వ్యక్తిగత ఇల్లు నిర్మాణానికి జీవీఎంసీ అనుమతిస్తే అందులో ఏకంగా 16 ఫ్లాట్లతో భారీ అపార్టుమెంట్‌నే నిర్మించేశారు. నగరంలో ఇలాంటి నిర్మాణాలు కోకొల్లలుగా ఉంటున్నాసరే టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం పట్టనట్టు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్తులో దీనివల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిసినా సరే తమ వ్యక్తిగత లబ్ధిని దృష్టిలో పెట్టుకుని అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

వార్డు సచివాలయం నుంచే కలెక్షన్ మొదలు...

నగరంలో ఎవరైనా భవన నిర్మాణం చేయాలంటే ముందుగా లైసెన్స్‌డ్ సర్వేయర్ వద్దకు వెళ్లి స్థలానికి సంబంధించి పత్రాలు, భవనం డిజైన్, డ్రాయింగ్, సాయిల్ టెస్ట్ రిపోర్టును ఏపీడీపీఎంఎస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆ దరఖాస్తు సంబంధిత ప్రాంత వార్డు సచివాలయంలోని ప్లానింగ్ సెక్రటరీకి చేరుతుంది. అక్కడే వసూళ్ల పర్వం మొదలవుతుంది. దరఖాస్తును చూడగానే స్థలాన్ని చూడాలంటూ లైసెన్స్‌డ్ సర్వేయర్ ద్వారా వార్డు ప్లానింగ్ సెక్రటరీ భవన నిర్మాణదారుడిని కలుస్తాడు. స్థలంపై వివాదాలు, రోడ్డు సదుపాయం, నేల స్వభావం వంటివి పరిశీలించిన తర్వాత వాటిపై రిమార్కు రాసి ఉన్నతాధికారికి దరఖాస్తును పంపించాల్సి ఉంటుంది. కానీ భవనం స్థాయిని బట్టి అధికారులందరికీ ఇవ్వాలంటూ కొందరు కనీసం రూ.ఐదు నుంచి రూ.పది లక్షలు వసూలు వసూలుచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు అందితే వారం రోజుల్లో ప్లాన్ ఆన్‌లైన్‌లో ఆమోదం పొందేస్తుంది. అలా కానట్టయితే ఏవో కొర్రీలు కారణంగా నెలలపాటు పెండింగ్‌లో ఉండిపోతుంది. అనుకున్నంత డబ్బులు ఇచ్చేస్తే తర్వాత భవన నిర్మాణం వైపు టౌన్‌ప్లానింగ్ అధికారులు చూడడం లేదు. సెట్‌బ్యాక్‌లు వదలకపోయినా, రోడ్డు వెడల్పు అవసరమైనంత లేకపోయినా సరే అంతా సక్రమంగానే ఉన్నట్టు నిర్మాణదారుడికి అండగా నిలుస్తారు. జారీచేసిన ప్లాన్ కంటే అదనపు అంతస్థులు నిర్మిస్తే...అందుకు తగ్గట్టు వసూలు చేస్తున్నారు.

అన్నదానంలో లోపాలపై విచారణ శూన్యం

... 5వ పేజీ తరువాయి

బయోమెట్రిక్ తీసుకోవడం లేదని చాలా స్పష్టంగా వార్త ప్రచురిస్తే దానిపై బాధ్యులైన అధికారులను వివరణ కోరకుండా లేని బయోమెట్రిక్ వివరాలు సమర్పించాలని కోరడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

విశాఖలోని ఒక ఆలయంలో అన్నదానం విభాగం నుంచి లక్ష రూపాయలు ప్రతి నెలా ఉన్నతాధికారికి ఇవ్వడానికి అక్కడ బయోమెట్రిక్ అమలు చేయడం లేదు. రికార్డులు అన్నీ మాన్యువల్‌గా నచ్చినట్టు రాసుకుంటున్నారు. ఆ దేవస్థానంలో బయోమెట్రిక్ యంత్రాలు ఉన్నప్పటికీ, వాటితోనే భక్తుల సంఖ్య నమోదు చేయాలని ఉత్తర్వులు ఉన్నప్పటికీ పాటించకపోవడం అక్కడి అవకతవకలకు అద్దం పడుతోంది. ఇది పత్రికలో రాగానే బయోమెట్రిక్ అమలు చేయాలని ఆదేశించకుండా ఐదు జిల్లాల అధికారులు నివేదిక ఇవ్వాలని విజయవాడ అధికారులు కోరడం తప్పు చేసిన వారిని తప్పించడానికేనని దేవదాయ శాఖ వర్గాలు కోడై కూస్తున్నాయి. అన్నదానంలో డబ్బులు మిగలడానికి నాశిరకం దినుసులు వాడుతున్నారు. ఇప్పుడు వాటికి లేబొరేటరీ నివేదిక కోరుతున్నారు కాబట్టి వాటిని కూడా నకిలీవి తయారుచేసి పంపే అవకాశం ఉందనే అనుమానాలు కలుగుతున్నాయి. సింహాచలం దేవస్థానం సిబ్బందిని ఇటీవల తప్పనిసరిగా బదిలీ చేయాల్సి వచ్చింది. కమిషనర్ కార్యాలయం అధికారులు వారిని దూర ప్రాంతాలకు పంపకుండా స్థానికంగా ఉన్న కనకమహాలక్ష్మి ఆలయానికి బదిలీ చేశారు. ఒకరిద్దరిని దూరంగా వేసినా నెల రోజులు తిరగకుండానే మళ్లీ విశాఖపట్నం తీసుకువచ్చారు. ఇప్పుడు అక్కడే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాటిపై దృష్టిసారిస్తే కమిషనర్ కార్యాలయానికి కూడా సెగ తగిలే అవకాశం ఉండడంతో ఎటువంటి ప్రత్యేక విచారణ చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

భారీ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

... 5వ పేజీ తరువాయి

చేశారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఆ బృందం సాంకేతిక ఆధారాలతో విశ్లేషణ చేసి నెల్లూరు జిల్లా కడవల మండలానికి చెందిన అర్జున్ జ్ఞానప్రకాశ్ (26), శ్రీకాకుళం జిల్లా గార మండలవాసి, ప్రస్తుతం నెల్లూరు జిల్లా వైపాడు మండలంలో ఉంటున్న లింగిబెడి రాంబాబు (30)ల హస్తం ఉన్నట్టు గుర్తించారు. వారిని తెలంగాణ రాష్ట్రం మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్టు చేశారు. వారు నేరాన్ని అంగీకరించడంతో పాటు చోరీకి అసలు సూత్రధారి నర్సీపట్నం ప్రాంతానికి చెందిన చిటికల నాగేశ్వరావు అలియస్ నగేశ్ (34)గా గుర్తించారు. అతడు గాజువాక బీసీ రోడ్డులో ఉన్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 72 తులాల బంగారు ఆభరణాలు, రూ.9.04 లక్షల నగదును స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు.

కాగా నిందితుల్లో నాగేశ్వరరావుపై కాకినాడ, అనకాపల్లి, పశ్చిమ గోదావరి తదితర జిల్లాల్లో మొత్తం ఎనిమిది కేసులు ఉన్నట్టు గుర్తించారు. అర్జున్ జ్ఞానప్రకాశ్, రాంబాబుల మీద తెలంగాణలో ఒక మర్డర్ కేసుతో పాటు నెల్లూరు తదితర ప్రాంతాల్లో ఐదుకు పైగా చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. నిందితుల మధ్య పాత పరిచయాలతో ముగ్గురూ కలిసి చోరీలకు పాల్పడుతుంటారని విచారణలో తేలిందని డీసీపీ వివరించారు.

వ్యూహప్రతివ్యూహాలు

... 5వ పేజీ తరువాయి

తొలగింపు, కోడివ్యర్థాల తరలింపులో నేతలు, అధికారుల ప్రమేయం, రోడ్లను శుభ్రం చేసే యంత్రాలను బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న కాంట్రాక్టర్‌కు అప్పగించడం వంటి అంశాలపై సభలో నిలదీయాలని వైసీపీ కార్పొరేటర్లు భావిస్తున్నారు. మరోవైపు కూటమిలోని అసంతృప్త కార్పొరేటర్లు సైతం తమవార్డులకు నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం, జోన్ల పునర్విభజన, క్లాప్ వాహనాల నిర్వహణ లోపభూయిష్టంగా తయారవ్వడం, కోడి వ్యర్థాల తరలింపులో కార్పొరేటర్లు, రౌడీషీటర్ల ప్రమేయం, పాతజైలురోడ్డులోని ఫుడ్‌కోర్ట్ తరలింపు, మెకానికల్ విభాగంలో జరుగుతున్న అవినీతిపై అధికారులను నిలదీయాలని భావిస్తున్నారు.

యూసీడీ ఆధ్వర్యంలో ఐదుచోట్ల ఆధునిక స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ల నిర్మాణం అంశం, వెండింగ్ కమిటీల ఎంపిక వంటి అంశాలపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది. కాగా స్టీల్‌ప్లాంటులోని ఒక్కో విభాగాన్ని ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించాలని సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు డిమాండ్ చేయనున్నారు. ఇదిలావుండగా కౌన్సిల్ సమావేశం సందర్భంగా ఏర్పాట్లను కమిషనర్ కేతన్‌గార్గ్ గురువారం పరిశీలించారు. కౌన్సిల్‌హాల్‌లోకి వెళ్లి మైక్‌ల పనితీరు, సభ్యులు కూర్చొనే కుర్చీలు, మేయర్ పోడియం, గ్యాలరీని పరిశీలించారు. అనధికారవ్యక్తులు లోపలకు రాకుండా అడ్డుకునేందుకు అధికారులకు కొన్ని సూచనలు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నిర్వాహణ మరమ్మతుల పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మహారాణి పార్లర్ ఏరియా, నరసింహనగర్, గణేశ్‌నగర్, బాలయ్య శాస్త్రి లేఅవుట్, కైలాసపురం, శాంతినగర్, అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, ప్రజలు సహకరించాలని కోరారు.

కనక మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

మహారాణిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లో ఉన్న కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం గురువారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం చివరి గురువారం కావడంతో వేకువజామున అమ్మవారిని మేల్కొలిపి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

అంతర్జాతీయ విద్యకు డిమాండ్

మహారాణిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా అంతర్జాతీయ విద్యకు డిమాండ్ ఉందని ప్రముఖ విద్యావేత్త వినయ్‌శర్మ అన్నారు. జిల్లా పరిషత్ జంక్షన్‌లో ఉన్న ఒక సమావేశ మందిరంలో విద్యార్థుల్లో విద్యాధోరణి అన్న అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అంతర్జాతీయ విద్య పట్ల ఆసక్తి చూపిస్తున్నారని తెలిపారు. సదస్సులో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేవీలో కళా ఉత్సవాలు ప్రారంభం

మర్రిపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 104 ఏరియా కేంద్రీయ విద్యాలయంలో గురువారం నుంచి కళా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మేనేజింగ్ కమిటీ చైర్మన్ కమాండర్ ధీరజ్ కన్నా జ్యోతి ప్రజ్వలన చేసి, ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాలయంలో ఏటా నిర్వహిస్తున్న కళా ఉత్సవాలు విద్యార్థులకు ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయని, కళల పట్ల ఆసక్తి పెంపొందిస్తున్నాయని తెలిపారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. కాగా ఈనెల 21 నుంచి 23 వరకు జరిగే ఈ ఉత్సవాల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లోని 8 క్లస్టర్లలోని 72 పాఠశాలల నుంచి 420 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు.

బాల్ బ్యాడ్మింటన్ టోర్నీలో తూర్పు కోస్తా రైల్వే గెలుపు

విశాఖపట్నం, స్పోర్ట్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):వాల్తేరు రైల్వే స్పోర్ట్స్ ఎరీనాలో జరుగుతున్న అఖిల భారత పురుషుల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ టోర్నీ ఆసక్తికరంగా సాగుతోంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య తూర్పు కోస్తా రైల్వే విజయం సాధించింది. సౌత్ సెంట్రల్ రైల్వేతో జరిగిన మ్యాచ్‌లో 2-0 స్కోరుతో గెలుపొంది పరువు నిలబెట్టుకోగా, మరో మ్యాచ్‌లో ఐసీఎఫ్ చేతిలో 2-0 స్కోరుతో ఓడింది. లీగ్ మ్యాచ్‌లో ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ వరుస విజయాలతో దూసుకుపోతోంది.

కుమార్తెలపై అత్యాచారం కేసులో ముద్దాయికి 20 ఏళ్లు జైలు

... 5వ పేజీ తరువాయి

పెద్ద కుమార్తె విషయాన్ని పాఠశాల టీచర్‌కు చెప్పింది. బాలిక తల్లిని టీచర్ పిలిచి విషయాన్ని వివరించింది. కుమార్తెల ఇద్దరి నుంచి నిజం తెలుసుకున్న తల్లి గత ఏడాది సెప్టెంబరు 14న ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దిశ పోలీస్ స్టేషన్ ఏసీపీ ఇ.పెంటారావు కేసు నమోదుచేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. బాధిత బాలికలు ప్రభుత్వం నుంచి పరిహారం పొందవచ్చునని తీర్పులో పేర్కొంటూ ఇందుకు తగిన న్యాయ సహాయం అందించాలని న్యాయసేవా ప్రాధికార సంస్థకు సూచించారు.


శారదా స్ట్రీట్ రోడ్డులో ఇరువైపులా వాహనాల పార్కింగ్


రోడ్డు పక్కన నిలిపివేసిన లారీ, ఇతర భారీ వాహనాలు

రోడ్డుపై భారీ వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు

డాబాగార్డెన్స్ ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : డాబాగార్డెన్స్‌లో రోడ్డుపై భారీ వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా లలితా కాలనీ, కృష్ణా గార్డెన్స్ ప్రాంతాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్డుకు సగానికి పైగా వాహనాల పార్కింగ్‌తో నిండిపోతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య కళ్ల ముందు కనిపిస్తున్నా అధికారుల్లో చలనం ఉండడం లేదు. సాయంత్రం వేళల్లో ఈ సమస్య మరింత జటిలంగా మారుతోంది. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

నేడు డీఎస్సీ మెరిట్ జాబితా

... 5వ పేజీ తరువాయి

బృందాలను నియమించారు. అంటే 31 మంది ఎంఈవోలు, హెచ్‌ఎంలు, డీటీలకు డ్యూటీలు వేశారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఈ మేరకు విశాఖ డీఈవో ప్రేమ్‌కుమార్‌కు ఆదేశాలు జారీచేశారు. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో 1:1 ప్రాతిపదికగానే పిలుస్తున్నారు. అంటే 1,139 మందిని పిలుస్తారు. ఒకవేళ ఒక అభ్యర్థి రెండు, మూడు పోస్టులు దక్కించుకునే మార్కులు సంపాదిస్తే ఒక పోస్టును మాత్రమే అతను ఎంపిక చేసుకోవాలి. అటువంటి సందర్భాలలో సదరు అభ్యర్థి తరువాత మార్కులు తెచ్చుకునే అభ్యర్థికి అవకాశం ఇస్తారు. ఇక్కడ కూడా రోస్టర్ పాయింట్లను పరిగణనలోకి తీసుకుంటారు. సర్టిఫికెట్ల పరిశీలన ముగిసిన తరువాత నియామక పత్రాలు అందజేసే ప్రక్రియ చేపడతారు. దీనిపై స్పష్టత రావలసి ఉంది.

గవర్నమెంట్ అసిస్టెంట్ న్యాయవాదిగా సతీశ్‌కుమార్

డాబాగార్డెన్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అరవ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సీనియర్ డివిజన్ విశాఖపట్నం అసిస్టెంట్ గవర్నమెంట్ న్యాయవాదిగా సీనియర్ న్యాయవాది సావిలి సతీష్‌కుమార్ నియమితులయ్యారు. అరవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు సంబంధించి సివిల్ క్యాసెస్ మూడు సంవత్సరాల పాటు చూస్తారు. నెలకు రూ.18 వేలు హోనరేరియమ్ ఇస్తారని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ లీగల్‌అఫైర్స్ డిపార్ట్‌మెంట్ గొట్టాపు ప్రతిభా దేవి తెలిపారు. ఈమేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేవారు.

మూడు వార్డుల్లో అంధకారం


చీకటిగా ఉన్న సాలిగ్రామపురం

అక్కయ్యపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 44,45,46 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో చీకటి రాజ్యమేలుతోంది. దీనివల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొద్ది రోజులుగా నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న అక్కయ్యపాలెం సౌత్ బస్టాప్ వద్ద, కైలాసపురం, సాలిగ్రామపురం ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదని పలువురు చెబుతున్నారు. మహిళలు, యువతులు చీకటిలో రాకపోకలు సాగించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఆయా ప్రాంతాల్లో దొంగతనాలు కూడా జరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. వాహనదారులు హెడ్‌లైట్ల వెలుగులోనే ప్రయాణాలు సాగిస్తున్నారు. అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని నూతనంగా ఏర్పాటు చేసిన పార్కులో లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో చీకటిగా ఉంటోంది. అధికారులు తక్షణమే స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'లులూ'కు భూ కేటాయింపులు సరికాదు



మాట్లాడుతున్న రాణిశర్మ

డాబాగార్డెన్స్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఆర్కే బీచ్‌లో లులూమాల్ సంస్థకు కేటాయించిన 14 ఎకరాలను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఆ స్థలంలో సైన్స్ సిటీ నిర్మించాలని ప్రముఖ సామాజిక కార్యకర్త, విశాఖ ప్రజా వనరుల పరిరక్షణ వేదిక చైర్‌పర్సన్ రాణిశర్మ కోరారు. గురువారం ఆమె డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లులూ వద్దు- సైన్స్ సిటీ ముద్దు అన్న నినాదంతో ఉద్యమం చేస్తామని తెలిపారు. 99 ఏళ్లకు విలువైన భూములను నామమాత్ర లీజుకు ప్రభుత్వం ఇస్తుందని, మూడేళ్లు ఎటువంటి లీజు చెల్లించాల్సిన అవసరం లేదని జీఓ 137లో పేర్కొనడం సరికాదని చెప్పారు.ఆ సంస్థకు వందల కోట్ల రాయితీలు కూడా ఇచ్చారన్నారు. ఈ విషయమై సెప్టెంబరు 1న ప్రజాభిప్రాయ సేకరణ చేసి, తదుపరి ప్రజా బ్యాలెట్ నిర్వహిస్తామని ప్రకటించారు. విశాఖ పౌరుల అభిప్రాయం తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా విదేశీ సంస్థకు భూములు కేటాయించడం ప్రజా వ్యతిరేకమన్నారు. లులూ మాల్‌తో విశాఖలో అనేక షాపింగ్‌మాల్స్, డిపార్ట్‌మెంట్ స్టోర్స్ మూత పడతాయని తెలిపారు. నగరంలో ప్రజా వనరుల పరిరక్షణ కోసం చేస్తున్న ఈ ఉద్యమంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు.ఈ సమావేశంలో ఆ సంఘం కన్వీనర్ బి. గంగారావు, క్షేత్రపాల్, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

హైవేపై హడలెత్తిస్తున్న దోపిడీలు

» గంజాయి మత్తులో ఆగంతకుల హల్‌చల్

» కట్టడిపై దృష్టి సారించని పోలీసు యంత్రాంగం

పెందుర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై దోపిడీ సంఘటనలు చోటుచేసుకోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. సరిపల్లి ఫ్లైవోవర్ దోపిడీ దారులకు అడ్డాగా మారింది. చీకటిగా ఉన్న ప్రాంతాన్ని ఎంచుకుని ప్రయాణికులను బెదిరించి దోపిడీ చేస్తున్నారు. ఇటీవల వరుసగా సంఘటనలు చోటుచేసుకుంటుండడంతో రాత్రి సమయంలో ప్రయాణానికి ద్విచక్రవాహన చోదకులు భయపడుతున్నారు. ఇటీవల ఇండిగో సంస్థలో పనిచేస్తున్న కరకవానిపాలేనికి చెందిన సంతోశ్‌ను ముగ్గురు దుండగులు అడ్డగించి, కత్తులతో బెదిరించి దోచుకున్నారు. రెండు నెలల కందట గోవిందపురానికి చెందిన ఓ వ్యక్తి సైకిల్‌పై వస్తుండగా, దుండగులు అడ్డగించి రూ.10 వేలు దోచుకున్నారు. జీవీఎంసీ వాటర్‌సప్లై విభాగంలో పనిచేస్తున్న వ్యక్తి ఆటోతో వస్తుండగా కోడిగుడ్లతో అద్దంపై కొట్టి డబ్బులు డిమాండ్ చేశారు. అతడు ప్రతిఘటించడంతో బ్లేడుతో మణికట్టుపై గాయపరిచి రూ.10 వేలు దోచేశారు. గతంలో రెండు బైక్‌లపై ముసుగులు ధరించిన ఐదుగురు ఆగంతకులు బైపాస్ రోడ్డు వద్ద కోనసీమకు ట్రక్ డ్రైవర్ శ్రీనివాసరావును కత్తులతో బెదిరించి రూ.10 వేలు, సెల్‌ఫోన్ అపహరించారు. గంజాయి మత్తులో పలువురు దారి దోపిడీలకు పాల్పడుతు


దోపిడీలకు నిలయంగా మారిన పెందుర్తి వద్ద జాతీయ రహదారి

న్నట్టు పోలీసులు గుర్తించారు. అయితే నియంత్రించే దిశగా వారు చర్యలు చేపట్టకపోవడంతో వరుస సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. డ్రోన్‌లతో నేరాలకు చెక్ పెడతామని చెబుతున్న పోలీసు యంత్రాంగం దారి దోపిడీలకు పాల్పడే ముఠాలను గుర్తించి శిక్ష పడేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : బీహెచ్‌పీవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ బీహెచ్‌పీవీ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో శుక్రవారం మొక్కల తొలగింపు, ఇతర నిర్వాహణ పనులను చేపట్టనున్నట్టు జోన్- 2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ ఫీడర్ పరిధిలోని అక్కిరెడ్డిపాలెం, పంచవటి కాలనీ, కాద చెరువు, రామాలయం వీధి ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

అగనంపూడిలో..

అగనంపూడి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : వీఎస్ఈజెడ్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ అగనంపూడి సెక్షన్ ఏఈ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకూ అగనంపూడి, డొంకాడ, బీసీ కాలనీ, కొండయ్యవలస, సాయినగర్, దానబోయినపాలెం, తలారివానిపాలెం, అండమాన్ కొండయ్యవలస, పెదమడక, పినమడక, ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి ఏరియా, దువ్వాడ, మంగళపాలెం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, వెదుళ్లనరవ, గంగవరం, శెట్టిపాలెం, లంకివానిపాలెం, అజనగిరి గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గోపాలపట్నం పరిధిలో...

గోపాలపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణలో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. పాతగోపాలపట్నం, రైల్వేస్టేషన్, ఎర్రచెరువు, గణేశ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదని జోన్-3 ఈఈ బి.సింహాచలంనాయుడు తెలిపారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు


అలంకరణలో ఉమామహేశ్వర స్వామి

అగనంపూడి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక ఉమామమేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని గురువారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని రుద్రాభిషేకాలు చేశారు. నిర్వాహకులు మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన, భక్తిగీతాలను ఆలపించారు.

వాహనాల తనిఖీ

సింధియా, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఏకేసీ కాలనీ జంక్షన్‌లో గురువారం ట్రాఫిక్ ఎస్.ఐ జి.అప్పారావు చలానా డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు వాహనాలను నిలిపి చలానాలు ఉంటే పరిశీలించి, హెల్మెట్ లేని వాహనదారులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24, టమాటా 47, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 32, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 22, బీరకాయలు 44, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 20, క్యారెట్ 44, దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటి కాయ (పె)10, మునక్కాడలు (కిలో) 32, అల్లం (పాతది) 72, బరబాటి 38, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 68, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడ దుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, క్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	101
లైవ్ ధర	121
విత్ స్కిన్	212
స్కిన్‌లెస్	222

బాలాజీ క్షేత్రంలో ఘనంగా తిరుప్పావడ సేవ


తిరుప్పావడ సేవ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం ఆఖరి గురువారం సందర్భంగా షీలానగర్ ఎన్వీబీఎల్ ప్రాంగణంలోని బాలాజీ దివ్యక్షేత్రంలో నిర్వహించిన తిరుప్పావడ సేవ భక్తులను ఎంతో ఆకట్టుకుంది. దివ్యక్షేత్రంలో వేదపండితులు వేంకటేశ్వరస్వామి వారికి పంచామృతాలతో అభిషేకించి పలు రకాల పుష్పాలు, తులసీ దళాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 30 కిలోల పులిహోరను స్వామి వారి ముందు ప్రత్యేక వేదికపై స్వామి వారి ఆకారంలో రాశులుగా పోసి పూలు, పండ్లతో పాటు వివిధ రకాల మిఠాయిలతో సుందరంగా తీర్చిదిద్దిన వేదపండితులు శ్రీనివాస గద్యాన్ని ఆలపిస్తూ స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆలయంలో వేదపండితులు భక్తులకు స్వామి వారి నేత్ర దర్శనం, నిజరూప దర్శనం కల్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో పాలక మండలి సభ్యులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అప్సా కార్యవర్గ ఎన్నిక


కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న ప్రతినిధులు

పెందుర్తి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్(అప్సా) ఆధ్వర్యంలో పెందుర్తి నియోజకవర్గ నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక బాలాజీ స్కూల్‌లో గురువారం ఏకగ్రీవంగా జరిగింది. అప్సా అధ్యక్షుడిగా బీఎస్ రావు, కార్యదర్శిగా ఎం.రామ్‌ప్రసాద్, ట్రెజరర్‌గా ఎస్.రమణ నియమితులయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీమనోహర్ ఎన్నికలను పర్యవేక్షించారు.

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు


రాజశేఖర్ (ఫైల్ ఫొటో)

పెందుర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన కుమారుడు అదృశ్యమయ్యాడని తండ్రి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చినముషిడివాడకు చెందిన ఉద్దండరావు రాజశేఖర్(35) మే 25న బయటికి వెళ్లాడు. అప్పటి నుంచి అతని సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉంది. ఆచూకీ కోసం పలుచోట్ల ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో తండ్రి చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆమె కళ్లు సజీవం

» నేత్రదానం చేసిన మహిళ


వరలక్ష్మి (ఫైల్ ఫొటో)

పెందుర్తి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పెందుర్తికి చెందిన భక్తుల వరలక్ష్మి (46) ఊపిరితిత్తుల సమస్యతో మృతి చెందారు. ఈ సమాచారాన్ని ఆమె కుమారుడు రాజశేఖర్ ద్వారా తెలుసుకున్న సాయిహెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీను నేత్రదానంపై వారికి వివరించారు. వారు అంగీకరించడంతో ఎల్వీప్రసాద్ మోషన్ ఐబ్యాంకు వైద్యులను సంప్రదించి కళ్లను సేకరించి, భద్రపరిచారు.

ఆవిష్కాంధ్రపై విద్యార్థులకు అవగాహన

గోపాలపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఆవిష్కాంధ్ర-25 పై గురువారం బెహరా ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆవిష్కాంధ్ర ఇన్నోవేషన్ సారథి సభ్యుడు ప్రవుణ్ ఇల్లపాణి మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉద్యోగాలు కల్పించే ఆలోచనలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నూతన ఆవిష్కరణలతో స్టార్టప్ కంపెనీల స్థాపనపై దృష్టిసారించాలన్నారు. విద్యార్థుల్ని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించిందని, శిక్షణ అందించి స్టార్టప్‌లు ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆవిష్కాంధ్రపై ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రసంగాన్ని వినిపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ పట్నాయక్, జ్యోత్స్న కుంచె, శశిరేఖ, కిరణ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుడివాడ అప్పన్న కాలనీ కార్యవర్గం


ఎన్నికైన కార్యవర్గ సభ్యుల ఆనందం

మల్కాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుడివాడ అప్పన్నకాలనీ కార్యవర్గం ఎంపిక గురువారం జరిగింది. గౌరవాధ్యక్షుడిగా పోలిశెట్టి నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా నగిరెడ్డి నరసింహరావు, ఉపధ్యక్షుడిగా పి.నూకరాజు, ప్రధాన కార్యదర్శిగా పోలిశెట్టి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా ఎ.నారాయణరావు, టీ.ప్రసాద్, పి.భాస్కర్‌రావు, చంద్రశేఖర్, కోశాధికారిగా పూడి రామనాయుడు, సహాయ కోశాధికారిగా కొన్న అప్పన్న, ఆర్గనైజర్‌గా పిల్లి శంకరరావు తదితరులు ఎంపికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు సీఐ గొలగాని అప్పారావుకు సమస్యలను వివరించారు.

బాక్సింగ్ విజేత అలేఖ్యకు అభినందనలు


అలేఖ్యను అభినందిస్తున్న నేవీ అధికారులు

సింధియా, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7 నుంచి 13 వరకు ఉత్తరప్రదేశ్ నోయిడాలో నిర్వహించినజాతీయ సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీలో పాల్గొన్న కేంద్రీయ విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్న వడ్డాది అలేఖ్య 40-43 కిలోల విభాగంలో విజయం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం అలేఖ్యకు అభినందించింది. అలేఖ్య తండ్రి వడ్డాది హరి రక్షణ పౌర ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి కుమార్తెను గుర్తించి నేవీ ఉన్నతాధికారులు గురువారం అలేఖ్యను అభినందించారు. మరిన్ని పోటీల్లో పాల్గొని దేశానికి మంచి పేరు తేవాలన్నారు. సాయి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంస్థలో శిక్షణ పొందుతున్న అలేఖ్య ప్రభుత్వ సహాయ సౌకర్యాలు ఉంటే మరెన్నో మెడల్స్ సాధిస్తానన్నారు.

రహదారిపై యథేచ్ఛగా పశువుల సంచారం


రహదారి మధ్యనే సంచరిస్తున్న పశువులు

కూర్మన్నపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రహదారులపై విచ్చ విడిగా పశువులు సంచరిస్తుండడంతో ప్రతిరోజూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయినప్పటికీ పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని పలువురు వాపోతున్నారు. వడ్లపూడి నుంచి కూర్మన్నపాలెం రహదారిలో సమీప పాత వడ్లపూడి, కణితి నుంచి పశులను తరలిస్తున్నారు. ఇవి గుంపులుగా సంచరిస్తూ రహదారిపైనే పేడ వేస్తుండటంతో ద్విచక్రవాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. భారీవాహనాలకు పశువులు అడ్డుగా రావడంతో తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. కాపరులు రహదారిపై విడిచి పెట్టడంతో విధులకు వెళ్లే స్టీలుప్లాంటు, వీఎస్ఈజడ్ ఉద్యోగులు, స్టీలుప్లాంటు పరిశ్రమలకు ముడిసరకును తరలించే వాహనాలకు అడ్డుగా రావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

మహారాణిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వచ్చే నెల 13 వరకూ జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజా చెప్పారు. గురువారం ఆయన జిల్లా కోర్టులో పోలీసు అధికారులు, న్యాయవాదులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉండి రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి పరిష్కరించాలన్నారు.కేసుల పరిష్కారం ద్వారా సామాన్యులకు న్యాయం అందుతుందన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

» 87వ వార్డు ప్రజల ఆందోళన

కూర్మన్నపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 87వ వార్డు సిద్ధార్థ నగర్‌లో ఉన్న 12 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు వద్ద తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ వార్డు ప్రజలు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు మాటాడుతూ సిద్ధార్థ నగర్‌లో సుమారు 15 ఏళ్ల క్రితం ఈ 12 ఎంఎల్‌డీ ప్లాంటు నిర్మించే సమయానికి 86, 87 వార్డుల్లో కేవలం 25 వేలు జనాభా ఉండేవారనీ, ఆటోనగర్‌లో కొన్ని కర్మాగారాలు మాత్రమే ఉండేవని, నేడు ఈ రెండు వార్డుల్లో సుమారు 60 వేలు మంది జనాభా, బహుళ అంతస్తుల భవనాలు, అధిక సంఖ్యలో కర్మాగారాలకు నాడు అమర్చి



సిద్ధార్థ నగర్‌లో 2 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు వద్ద నిరసన తెలుపుతున్న వార్డు ప్రజలు

న మోటార్ల ద్వారానే నేటికీ నీటి సరఫరా జరుగుతోందన్నారు. ఈ రెండు వార్డులకు తాగునీరు చాలక అవస్థలు పడుతున్నారన్నారు. ప్రస్తుతం స్టీలు కంచాల ద్వారా నీరు పట్టుకొని బిందెల్లో వేసుకొనే దుస్థితి ఏర్పడిందనీ ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ 86వ వార్డులో ఎంవీవీ ఎంకె పార్కుతో పాటు, మరి కొన్ని బహుళ అంతస్తుల భవన యాజమాన్యాలు సుమారు 600 కేఎల్ తాగునీరు బల్క్‌గా అడుగుతున్న నేపథ్యంలో 70 హెచ్‌పీ నూతన మోటార్లు, 87వ వార్డులో మరో 12 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు అవసరమనీ తెలిపారు.

ఈ విషయాన్ని ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మేయర్, జీవీఎంసీ కమీషనర్ పీలా శ్రీనివాసరావు, నీటి విభాగ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అధికారులు పలుమార్లు విచ్చేసి, పరిశీలించి, సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా, పనులు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..' చందంగా ముందుకు సాగడం లేదనీ అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు ప్రగడ దానయ్య, రాజన్‌రాజు, కాంట్రేకుల శ్రీను, కృష్ణ, జి.విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం, ఏ.సన్యాసిరావు, తిరుమల నగర్, సిద్దార్థ నగర్, కణితి, వడ్లపూడి కాలనీ వాసులు పాల్గొన్నారు.

23నుంచి కళాభారతి జాతీయ పురస్కార సభలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కళాభారతి నిర్వహకులు మంతెన సత్యనారాయణ, గుమ్మలూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ తదితరులు

21ఎమ్‌డిపి1:మద్దిలపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : కళాభారతి జాతీయ పురస్కార సభలు ఈనెల 23 నుంచి 28 వరకూ ఘనంగా నిర్వహించనున్నట్టు కళాభారతి అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ, కార్యదర్శి గుమ్మలూరి రాంబాబు తెలిపారు. పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 24 ఏళ్లుగా ప్రతి ఏటా కళాభారతి ఆగస్టులో జాతీయ పురస్కార సభలతో పాటు ఆరు రోజులు సంగీత, నృత్య, నాటక ఉత్సవాలు నిర్వహిస్తోందన్నారు. ఉత్సవాల్లో భాగంగా 23న ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాద్‌రావుకు నాద విద్యాభారతి బిరుదుతో సత్కరించి, స్వర్ణకమలం, రూ.లక్ష నగదు బహుమతి ప్రదానం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. సత్కారం అనంతరం ద్వారం సత్యానారాయణ వయోలిన్ వాయిద్య కచేరి ఉంటుందన్నారు. 24న కర్ణాటక, హిందుస్థానీ గాత్ర కచేరి, 25న విష్ణుభట్ల సిస్టర్స్ గాత్ర కచేరి, 26న బెంగళూరు బ్రదర్స్ గాత్ర కచేరి, 27న వసంత కిరణ్ ఆధ్వర్యంలో 33 మంది నృత్య కళాకారులతో హరిలీలా కల్పతరువు అనే నృత్య రూపకం, 28న శ్రీసాయిబాబా నాట్యమండలి నిర్వహణలో శ్రీఖడ్గ తిక్కన పద్య నాటకం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో పైడా కృష్ణప్రసాద్, గ్రంధి మల్లిక మనోజ్, పి.నరసింగరావు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడి కుటుంబానికి చేయూత


నగదు, నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

విశాఖపట్నం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వ వార్డు పరిధి సీతానగరంకు చెందిన క్యాన్సర్ బాధితునికి రూ.10 వేలు, వారి కుటుంబానికి మూడు నెలలకు సరిపోయే నిత్యావసరాలను పలువురు టీడీపీ నేతలు... టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతులమీదుగా అందజేశారు. క్యాన్సర్ బాధిత కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురవుతుందని గమనించిన టీడీపీ వార్డు కమిటీ పార్టీ నాయకులు ఒక్కొక్కరు కొంత మొత్తంగా విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తంతో కొనుగోలు చేసిన బియ్యం, పప్పు తదితర నిత్యావసరాలతో పాటు రూ.10 వేలు బాధితుడికి గురువారం గాజువాక పార్టీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మొల్లి పెంటిరాజు, 75వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నమ్మి అప్పారావు, కార్యదర్శి ములకలపల్లి పెంటయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి ఉరుకూటి అప్పలరాజు, వార్డు పరిశీలకుడు అరుగుల మణికుమార్ పార్టీ సీనియర్ నాయకులు బొంగురాజు, కణితి సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్


నాతయ్యపాలెంలో అభివృద్ధి పనుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 69వ వార్డు పరిధిలోని నాతయ్యపాలెం కాలనీలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను గురువారం వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పరిశీలించారు. కాలనీలో నిర్మిస్తున్న ప్రధాన రహదారితో పాటు అవుట్‌లెట్ పనులను ఆయన పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. త్వరగా పనులను పూర్తి చేసి కాలనీ ప్రజలు వినియోగించుకునేలా చూడాలని ఆయన కోరారు. ఈ పర్యటనలో కాలనీ నాయకులు గవర వెంకటరమణ, సంద్రాన చిన సన్యాసిరావు, పల్లెల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

86వ వార్డులో..

కూర్మన్నపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని 86వ వార్డు ఇన్‌ఛార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 86వ వార్డులో వుడా నగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం పరిశీలించారు. నాణ్యతను పాటించాలని సంబంధిత కాంట్రాక్టరును కోరారు. వార్డులోని పలు సచివాలయాల్లో సిబ్బంది పనితీరు సక్రమంగా లేదని పలువురు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు వార్డులో పలు సచివాలయాలను సందర్శించి ప్రజా సమస్యలను సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చూడమని కోరారు. అనంతరం వుడా ఫేజ్-7 కాలనీవాసులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరడంతో వారిని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వద్దకు తీసుకువెళ్లి వినతి పత్రం అందజేసి సమస్యలను వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పల్లా తక్షణమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటాననీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సెక్రటరీ వేగుంట శ్రీనివాస్, కె.రమేష్, బి.జగదీశ్, వేంకటేష్, సుబ్బయ్య పాల్గొన్నారు.

నేడు చిరంజీవి జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

అగనంపూడి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు, కేంద్ర మాజీ మంత్రి, మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను శుక్రవారం స్థానిక చిరు అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిరహించనున్నట్టు సంఘం ప్రతినిధి విందుల చిరురాజు తెలిపారు. స్థానిక దుర్గమాంబ ఆలయంలో చిరంజీవి పేరిట ప్రత్యేక పూజలు చేపట్టి వేడుకలను ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు వెల్లడించారు. చిరంజీవి అభిమానులంతా ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

24న సత్యమాంబ పండగ

పెందుర్తిరూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలఅగ్రహారం తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత సత్యమాంబ పండగను ఈనెల 24 ఆదివారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మేహాద్రి గెడ్డ బ్రిడ్జి వద్ద గల అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. పండగ రోజు ఉదయం అమ్మవారి ఊరేగింపు, అనంతరం దర్శనాలకు అనుమతిస్తామని నిర్వాహకులు తెలిపారు.

గౌరీనగర్‌లో బోరు బావి పనులు ప్రారంభం..

ఎన్ఏడీ జంక్షన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ గౌరీనగర్ రిక్షా కాలనీలో టీడీపీ, వైసీపీ నేతల మధ్య వివాదం కారణంగా నిలిపివేసిన బోరు బావి నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. తమ హయాంలో మంజూరయిందంటూ ఇరువర్గాలు వివాదాలకు దిగారు. మహిళలు బిందెలతో నిరసన తెలిపారు. ఎట్టకేలకు ఈ పనులు తిరిగి ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సాగర్ మృతదేహం

బీచ్ రోడ్డు, ఆగస్టు 21, (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆర్కే బీచ్ రోడ్డులో గురువారం జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పూర్ణా మార్కెట్ ప్రాంతానికి చెందిన కె.సాగర్ (26) బీచ్ రోడ్డులో పార్కు హోటల్ నుంచి ఆర్కే బీచ్ వైపు బైక్‌పై వస్తున్నాడు. ముందు వెళ్తున్న బైక్ యు టర్న్ తీసుకుంటున్న క్రమంలో దానిని బలంగా ఢీ కొట్టాడు. తలకు తీవ్ర గాయాలవడంతో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. సీఐ పి.పైడయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి ఆత్మహత్య


ప్రవల్లిక (ఫైల్ ఫొటో)

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన గురువారం అక్కిరెడ్డిపాలెం కాలనీలో జరిగింది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అక్కిరెడ్డిపాలెం కాలనీలో కొట్ని లక్ష్మి, కుమార్తె ప్రవల్లిక (24), కుమారుడు సాయి నివసిస్తున్నారు. లక్ష్మి మింది రహదారిలోని కార్ల షోరూంలో పనిచేస్తుండగా ప్రవల్లిక ఎమ్మెస్సీ పూర్తి చేసి కాంపిటేటివ్ పరీక్షలకు శిక్షణ పొందుతోంది. ఎప్పటిలాగే గురువారం లక్ష్మి విధులకు వెళ్లింది. సాయంత్రం బంధువు వచ్చి తలుపుకొట్టగా ఎవరూ తీయకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ప్రవల్లిక ఉరి వేసుకుని ఉండడాన్ని గుర్తించారు. విషయం తెలుసుకున్న లక్ష్మి, కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రవల్లిక షీలానగర్‌కు చెందిన యువకుడితో ప్రేమలో ఉందని, వారి మధ్య జరిగిన ఘర్షణలే ఆత్మహత్యకు కారణమై ఉంటుందని ఆమె తల్లి ఆరోపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, ఎస్ఐ సూర్యకళ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన తప్పనిసరి

- డిజిటలైజేషన్‌లో నంబరు 1 రాష్ట్రంగా ఏపీ
- సీఐఐ సదస్సులో గుడివాడ ఎమ్మెల్యే రాము వెనిగండ్ల


సీఐఐ సదస్సులో ప్రసంగిస్తున్న గుడివాడ ఎమ్మెల్యే రాము వెనిగండ్ల. పక్కన సీపీ శంఖబ్రత బాగ్చి. వేదికపై సీఐఐ పూర్వ చైర్మన్ శివకుమార్, సైబర్ సెక్యూరిటీ ఆర్కిటెక్ట్ కరన్ సంజాని, అభినవ్.

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతి ఒక్కరికి సైబర్ సెక్యూరిటీపై అవగాహన ఉండాలని ఎఫిసెన్స్ సిస్టమ్స్ చైర్మన్, గుడివాడ ఎమ్మెల్యే రాము వెనిగండ్ల అన్నారు. 'సైబర్‌సెక్యూర్ ఆంధ్రా 2025' పేరుతో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) మేరియట్ హోటల్‌లో గురువారం నిర్వహించిన సమావేశానికి ఆయన గౌరవ అతిథిగా హాజరై మాట్లాడారు. డిజిటలైజేషన్‌లో ఏపీ దేశంలోనే నంబర్ 1గా నిలవనుందని, దాంతో సైబర్ దాడులు మరిన్ని ఎక్కువవుతాయని, ప్రతి ఒక్కరు దీని గురించి తెలుసుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్లు ఇప్పుడు ప్రజల ఆరోగ్య రికార్డులు సైతం చోరీ చేస్తున్నారన్నారు. వీటిని ఎదుర్కొనడానికి రాష్ట్ర ప్రభుత్వం సైబర్ సెక్యూరిటీ ఆపరేషనల్ సెంటర్ నిర్వహిస్తోందన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ ఇతర దేశాల నుంచి మన దేశంపై సైబర్ దాడులు చేసేవారి సంఖ్య పెరిగిందన్నారు. వీటిని ఎదుర్కొనడానికి హోమ్ మేడ్ టూల్స్ తయారు చేయాలని సూచించారు. దేశంలో సైబర్ సెక్యూరిటీ మార్కెట్ 2027 నాటికి 3.5 బిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు. పబ్లిక్ డేటాను ఉంచుకునే బ్యాంకులు, ఆస్పత్రులు, విద్యా సంస్థలు అక్కడి సిబ్బందికి కూడా సైబర్ సెక్యూరిటీపై శిక్షణ ఇప్పించాలని సూచించారు. రుద్ర సైబర్ సెక్యూరిటీ చీఫ్ ఆర్కిటెక్ట్ కరన్ సంజాని మాట్లాడుతూ గుర్తు తెలియని ప్రాంతం నుంచి పవర్ గ్రిడ్లు, షిప్ లైన్లు మార్చేయవచ్చునన్నారు. సైబర్ సెక్యూరిటీ ఇంజనీరింగ్‌లో ఓ భాగమేనని, వేరుగా చూడవద్దని సూచించారు. ఈ సమావేశానికి సీఐఐ పూర్వ చైర్మన్ శివకుమార్ అధ్యక్షత వహించగా అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై పారిశుధ్యం మెరుగుపరచాలి

- ప్రసాదాల నాణ్యతపై శ్రద్ధ పెట్టండి
- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



కప్పస్తంభం వద్ద కలెక్టర్, దేవస్థానం అధికారులకు ఆదేశాలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

సింహాచలం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై పారిశుధ్యం మెరుగుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ డా.ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. అప్పన్న భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అభిప్రాయ సేకరణకు సింహగిరిపై గురువారం కలెక్టర్ పర్యటించారు. లోవతోటలో కేశ ఖండనశాల, స్నానాలు చేసే గంగధార, బట్టలు మార్చుకునే గదులు, ప్రసాదాల విక్రయకేంద్రాలు, నిత్యాన్న ప్రసాద భవనంలో కలెక్టర్ పర్యటించారు. అన్నప్రసాదం తీసుకుంటున్న భక్తులను రుచి, శుచి, నాణ్యతలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సింహగిరిపై పారిశుధ్యం మెరుగుపరచాల్సి ఉందన్నారు. ఇందుకోసం ప్రత్యేక పాయింట్లలో సిబ్బందిని నియమించడంతో పాటు పారిశధ్య నిర్వహణ చార్టును ఏర్పాటు చేసి అనుక్షణం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పులిహోర, లడ్డూ ప్రసాదాల నాణ్యతను పెంచాలన్నారు. అన్నప్రసాద నాణ్యతపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. రద్దీ ప్రాంతాల్లో భక్తులు కాళ్లకు ఎండవేడిమి నుంచి కల్పించేందుకు వీలుగా వైట్‌కూల్ పెయింట్ వేయాలన్నారు. మెట్టు రోడ్డు మార్గంలో కనీస వసతులు కల్పించాలని, ఆలయంలో మెరుగైన సేవలను అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రసాదాల తయారీకి వినియోగించే ముడిసరకుల నాణ్యతపై రాజీ వద్దన్నారు. క్వాలిటీ టెస్టులు చేయించాలన్నారు. కడపకు చెందిన భక్తుడొకరు అప్పన్న ఆభరణాలపై ఇచ్చిన ఫిర్యాదు పై మాట్లాడుతూ దేవదాయశాఖ పరిశీలనకు ప్రత్యేక కమిటీని నియమించిందని, నివేదిక ఆధారంగా చర్యలుంటాయన్నారు. కలెక్టర్ వెంట దేవస్థానం ఏఈఓలు కె.తిరుమలేశ్వరరావు, వి.రమణమూర్తి, పి.శ్రీనివాస్, కార్యనిర్వాహక ఇంజనీర్ సీహెచ్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వరాహలక్ష్మీనృసింహస్వామిని కలెక్టర్ దర్శించుకున్నారు. ఆయనకు ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకున్న కలెక్టర్ గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలుచేసి శేషవస్త్రా న్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి సన్నిధిలో పూజలు తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, ఏఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటో, ప్రసాదాలను అందజేశారు.

అభివృద్ధి రంగంలో భారతీయ ప్రమాణాలు రూపొందించాలి

- సీఎఫ్‌టీఆర్ఐ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ఎస్ మాచే


సదస్సులో పాల్గొన్న మాచే, ఇతరులు

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందుతున్న రంగాల్లో భారతీయ ప్రమాణాలను రూపొందించాల్సిన అవసరం ఉందని సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఎస్ఐఆర్ - సీఎఫ్‌టీఆర్ఐ) ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ఎస్ మాచే పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం సహకారంతో భారతీయ ప్రమాణాల సంస్థ (బీఐఎస్) ఇంజనీరింగ్ కాలేజీలో మూడు రోజులపాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ముగింపు కార్యక్రమానికి గురువారం ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లా డుతూ ప్రమాణాల రూపకల్పనలో వాటాదారుల భాగస్వామ్యం కీలకమన్నారు. అనంతరం ఎఫ్‌డీపీ నోడల్ ఫ్యాకల్టీ, కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ సీఎస్‌వీ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వృత్తిపరమైన అభ్యాసంలో భారతీయ ప్రమాణాల అనువర్తనం ప్రాముఖ్యత, భవిష్యత్తు భారతీయ ప్రమాణాలను అభివృద్ధి చేయడంలో సెక్షనల్ కమిటీల్లో విద్యావేత్తల పాత్రను వివరించారు. మొత్తంగా ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా 20 సెషన్లు నిర్వహించారు. ఏయూ, అనుబంధ కాలేజీలు, గీతం నుంచి 100 మందికిపైగా అధ్యాపకులు పాల్గొన్నారు. సమావేశంలో సివిల్ ఇంజనీ రింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.ఉషా మాధురి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నపాలెంలో వ్యక్తి ఆత్మహత్య

మల్కాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన వెంకన్నపాలెంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెంకన్నపాలేనికి చెందిన శ్రీకుల కనకరాజు (40) మద్యానికి బానిసయ్యాడు. దీనికి తోడు భార్య దూరంగా ఉండడంతో తీవ్రంగా కలతచెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. పక్కంటి వారు కొళాయి నీరు పట్టుకునేందుకు కనకరాజును పిలిచారు. తలుపులు తట్టినా తెరవకపోవడంతో మల్కాపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని తలుపులు తెరిచి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. హెచ్‌సీ శ్రీహరి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైలులో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని ఆరు కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ప్లాట్ పామ్‌లపై గురువారం తనిఖీలు చేస్తుండగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన అజయ్ (28) గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని పోలీసులు తెలిపారు.

టీచర్ల అంతర్ జిల్లా బదిలీలకు అవకాశం

ఆరిలోవ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, మునిసిపల్, మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అంతర్‌జిల్లా బదిలీలకు ప్రభుత్వం అనుమతించిందని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. దరఖాస్తులను ఈనెల 24వ తేదీలోగా లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. మ్యూచివల్, స్పౌజ్ క్యాటగిరీలో హెడ్ మాస్టర్, స్కూలు అసిస్టెంట్, ఎస్జీటీలకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తును డిప్యూటీ డీఈవో లేదా ఎంఈవోలకు అందజేయాలన్నారు. ఈనెల 26లోగా డీఈవో పరిశీలించి, 27న స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌కు నివేదిస్తారు. అక్కడ 29 వరకు పరిశీలించి 30న ప్రభుత్వానికి పంపుతారు. అనుమతి వచ్చిన వెంటనే బదిలీలు చేపడతారు.

డాక్టర్ యార్లగడ్డకు అరుదైన గౌరవం


అమెరికాలోని తెలుగువారితో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తెలుగు హిందీ భాషల్లో పీహెచ్‌డీ చేసిన రాజ్యసభ మాజీ సభ్యుడు, విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు అమెరికాలో అరుదైన గౌరవం లభించింది. టెక్సాస్, డాలస్ పరిసర ప్రాంతాల్లోని ఫ్రిస్కో, గార్లాండ్ , లిటిల్ ఎల్మ్ నగరాల మేయర్లు అభినందన పూర్వక అధికారిక గుర్తింపు పత్రాలు అందుకున్నారు. గార్లాండ్ నగర మేయర్ డిలన్ హెడ్రిక్‌తో బుధవారం యార్లగడ్డ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మేయర్ అధికారిక గుర్తింపు పత్రాన్ని అందజేశారు. ఆయా నగరాల మేయర్లు యార్లగడ్డను అభినందిస్తూ లేఖలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రవాసాంధ్రులు యార్లగడ్డను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేణు భాగ్యనగర్, ఆత్మచరణ్ రెడ్డి, గోపాల్ పోనంగి, డాక్టర్ తోటకూర ప్రసాద్, జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, శారద సింగిరెడ్డి, అనంత్ మల్లవరపు, సుబ్బారావు పర్వతనేని, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏటా అందజేసే జిల్లా ఉత్తమ ఉపా.ధ్యాయ అవార్డులకు ఈనెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలనిడీఈవో ఎన్.ప్రేమకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను మండల విద్యాశాఖాధికారి ద్వారా జిల్లా ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. సెకండరీ గ్రేడ్, స్కూలు అసిస్టెంట్స్, పీడీలు, ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకునే అవకా శం ఉందని, పది సంవత్సరాల కనీస సర్వీసు తప్పనిసరి అన్నారు. క్రమశిక్షణా ,చర్యలు, క్రిమినల్ కేసులున్నవారు అనర్హులన్నారు. ఎంపిక కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా, డీఈవో కన్వీనర్‌గా వ్యవహరిస్తారన్నారు.

గ్రీన్‌పార్క్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో


వస్త్రాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

మహారాణిపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పండగలు వివాహాది వేడుకల సందర్భంగా నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రత్యేక వస్త్ర ప్రదర్శన హోటల్ గ్రీన్ పార్కులో ప్రారంభమయింది. వినాయక చవితి, దసరాతో పాటు వివాహాది కార్యక్రమాలకు సంప్రదాయ, ఆధునిక ఫ్యాషన్లతో కూడిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామని నిర్వాహకులు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సంప్రదాయ వస్త్రాలను, మగ్గాలపై రూపొందించిన చేనేత వస్త్ర సంపదనను అందుబాటులోకి తెచ్చామన్నారు. వేలాది రకాల పట్టు, కాటన్‌వస్త్రాలు, డిజైనర్ చీరలు 50 శాతం తక్కువ ధరలకు అందిస్తున్నామన్నారు. ఈ ప్రదర్శన ఈనెల 26వరకు ప్రతి రోజు ఉదయం 11 నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఉంటుందని, ప్రవేశం ఉచితమన్నారు.

సమస్యలపై అంగన్‌వాడీల ధర్నా



మానవహారం చేపడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సిరిపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం ధర్నా చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నల్లరిబ్బన్లు ధరించి మానవహారం చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.వెంకటలక్ష్మి మాట్లాడుతూ వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ, బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షురాలు పి.శ్యామలదేవి తక్షణమే వేతనాలు పెంచాలన్నారు. నాణ్యమైన సరకులను పంపాలని, మెనూ రేట్లు పెంచాలని కోరారు. సమస్యలను పరిష్కరించే వరకు పోరాటాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నూకరత్నం, కృపారాణి, సుబ్బలక్ష్మి, రాధ, తదితరులు పాల్గొన్నారు.